RNI No.TELTEL/2016/68720




ప్రజలకోసం పోలీస్

# పోలీస్ నిఘా POLICE NIGAH

తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla(Vemulawada), Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad




రంగారెడ్డి | సంపుటి : 10 సంచిక : 177 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | బుధవారం 01-04-2026 | వెల: రూ.5/- | పేజీలు: 8

# ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభలు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభలను నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వరంగల్ కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే విధంగా ఉండేలా చూడాలని సూచించారు. గ్రామసభలకు వార్డు సభ్యుల నుంచి ఎంపీలు, మంత్రుల వరకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారంతో పాటు..**

గ్రామసభల్లో ముఖ్యమంత్రి సందేశంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించాలని, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు గ్రామ సభల్లో తమ అనుభవాలను పంచుకోవాలని సూచించారు. జూన్ 2 నుండి ప్రారంభించనున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారంతో పాటు పాలు, రాగి జావా అందించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజల నుండి వచ్చే అభిప్రాయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామాలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక అమలును కలెక్టర్లు నిరంతరం సమీక్షిస్తూ విజయవంతం చేయాలని ఆదేశించారు.

**ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి..**

ఈ సందర్భంగా సీఎస్ కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ, మార్చి 6 నుండి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, పారిశుద్ధ్య కార్యక్రమాలకు మంచి స్పందన వచ్చిందని, అదే ఉత్సాహంతో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామసభల నిర్వహణపై ప్రతి జిల్లాలో నివేదికలు సమర్పించాలని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, స్థానిక ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను వివరించాలని సీఎస్ కె. రామకృష్ణా రావు సూచించారు.

## మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాల సేకరణ

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. నేటి నుంచి ఏప్రిల్ 15 వరకు సలహాలు స్వీకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నంతో కూడిన కమిటీ నిర్ణయించింది. musirrdc@ gmail.comకు అభిప్రాయాలు పంపాలని కేబినెట్ సబ్ కమిటీ కోరింది.


# ఉచిత ప్రయాణాలతో రూ.10 వేల కోట్ల ఆదా

### మహాలక్ష్మి పథకం అభినందన కార్యక్రమంలో మంత్రి సీతక్క



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : సోనియా, రాహుల్ గాంధీ మల్లికార్జున్ ఖర్గేల ఆలోచనలకనుగుణంగా ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం కింద 290 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా రూ.10 వేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదాపై అభినందన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలకు బస్సు చార్జీలు లేకుండా ప్రయాణించే విధంగా ఆర్టీసీకి రూ.10 వేల కోట్ల నిధులు చెల్లించిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. నయాపైసా ఆర్థిక భారం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేసే విధంగా తమ ప్రభుత్వం మహిళలకు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎగతాళి చేసేలా కొందరు నేతలు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, మహిళలను కించపరిచే వారిని ప్రతి మహిళా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఈ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలదేనన్నారు. మహిళలకు డబ్బులు ఆదా కావాలి.. ఆత్మ గౌరవంతో బతకాలి.. ఆ విధంగా మహిళలకు ఆత్మగౌరవాన్ని కల్పించింది ఉచిత బస్సు ప్రయాణం అని పేర్కొన్నారు. ఉపాధి పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వరంగా మారిందన్నారు. ఆడబిడ్డల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పని చేస్తోందంటూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు కల్పించడంతో రూ.8 వేల కోట్ల పెట్టుబడులతో 4.7 లక్షల సూక్ష్మ పరిశ్రమలు మహిళలు ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళా సంఘాల రుణాలకు రూ.1390 కోట్ల వడ్డీలను చెల్లించామని, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు సంకల్పించామని ఆమె వెల్లడించారు. మహిళ సంతోషంగా ఉంటే రాష్ట్రం సంతోషంగా ఉంటుందన్నారు. తమది బీఆరఎస్ మాదిరి మాయమాటలు చెప్పి మోసం చేసే ప్రభుత్వం కాదన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్న మహిళలందరికీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకొని మహిళలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

# దేశంలో ఇంధన పరిస్థితి అదుపులో ఉంది: మోదీ



వావ్ థరాద్, మార్చి 31 : పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తలెత్తిన పరిస్థితులను వాడుకుని.. రాజకీయంగా లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ 'రాజకీయ రాబందు'లా కాచుకుని ఉందని ప్రధాని మోదీ విమర్శించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలను క్యూ కట్టించి అల్లకల్లోలం సృష్టించడానికి యత్నిస్తోందని ఆరోపించారు. గుజరాత్‌లోని వావ్– థరాద్ జిల్లాలో నిర్వహించిన సభలో ఈమేరకు ప్రసంగించారు. భారత్ ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కోగలదని ధీమా వ్యక్తం చేశారు. "యుద్ధంతో యావత్ ప్రపంచం సతమతమవుతోంది. అస్థిరత, ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పటిష్టమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యతతో భారత్ సమర్థమంతంగా వ్యవహరించింది. కానీ, కొన్ని రాజకీయ పార్టీలు పరిస్థితులను అవకాశంగా మార్చుకొని ప్రజల్లో భయాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను రెచ్చగొట్టడంలో నిమగ్నమైంది. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరేలా చేయాలని కోరుకుంటోంది. పరిస్థితులను అనుకూలంగా మలచుకొని లబ్ధిపొందేందుకు రాజకీయ రాబందుల మాదిరిగా ఆ పార్టీ ఎదురుచూస్తోంది" అని ప్రధాని మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అన్ని దేశాలు ప్రభావితమయ్యాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు దాదాపు పదిశాతం పెరిగినప్పటికీ ఆ ప్రభావం ప్రజలపై పడకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఎటువంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు.

# శ్రీ వీర హనుమాన్ విజయ యాత్రకు ముమ్మర ఏర్పాట్లు

### శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పిలుపు





హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) :హైదరాబాద్ నగరం వేదికగా ఏప్రిల్ 2న జరగనున్న శ్రీ హనుమాన్ జయంతి 'శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర'ను అత్యంత ప్రశాంతంగా, దిగ్విజయంగా నిర్వహించేందుకు నగర పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ యాత్ర ఏర్పాట్లపై బుధవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారి అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖలు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ గారు మాట్లాడుతూ..ఇటీవల జరిగిన శ్రీరామ నవమి శోభాయాత్రను అన్ని శాఖల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసినట్లే, హనుమాన్ విజయ యాత్రను కూడా శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 3,000 మంది పోలీసు సిబ్బందితో పాటు అదనపు సాయుధ బలగాలు, టాస్క్ ఫోర్స్ బృందాలను కీలక ప్రాంతాల్లో మోహరిస్తున్నట్లు వెల్లడించారు. యాత్ర నిర్వహణలో వాలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. యాత్రలో కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిర్ణీత మార్గాల్లోనే యాత్ర సాగేలా చూడాలని కోరారు. ఫ్లైఓవర్లు, రైల్వే బ్రిడ్జిల దృష్ట్యా విగ్రహాల ఎత్తు విషయంలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మళ్లింపులు చేపడతామని, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం అనంతరం సీపీ గారు గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకుని.. అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల యాత్ర మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ కార్యక్రమానికి శ్రీ తఫ్సీర్ ఇకుబాల్ , ఐపిఎస్, అడిషనల్ సిపి ఎల్ ఆండ్ ఓ, శ్రీ.డి.జోయల్ డెవిస్ ఐపిఎస్ జాయింట్ సిపి ట్రాఫిక్ హైదరాబాదు, శ్రీ.రవి కిరణ్ జోనల్ కమిషనర్ జిహెచ్ఎంసి, వైద్య శాఖ, విహెచ్.పి రాష్ట్ర ప్రెసిడెంట్, శ్రీ.నరసింహా మూర్తి, శ్రీ.రామరాజు ప్రెసిడెంట్, నేషనల్ మత్మందిర్ , శ్రీ.శ్రీకాంత్ తెంలంగాణ స్టేట్ కన్వీనర్, బజరంగ్ దల్, శ్రీ.శషిధర్ , స్పోక్స్ పర్సన్ విహెచ్.పి, సైబరాబాదు పోలీసు కమిషనరేట్ నుండి శ్రీ.వైవిఎస్.సుధీంద్ర డిసిపి సైబరాబాదు, మల్కాజ్గిరి పోలీసు కమిషనరేట్ నుండి శ్రీ.సిహెచ్.శ్రీధర్ ఐపిఎస్ డిసిపి మరియు హైదరాబాదు సిటీ లోని అన్ని జోనల్ డిసిపి లు, ఇతర అధికారులు మరియు వివిధ హిందూ సంస్థల ప్రతినిధులు సమన్వయ సమావేశంకు హాజరైనారు.

### శీతలా మాతా ఆలయంలో

# తొక్కిసలాట

### ఎనిమిది మంది మృతి



బిహార్, మార్చి 31 : బిహార్‌లో విషాదం చోటు చేసుకుంది. మంగళవారం నలంద జిల్లాలోని శీతలా మాతా ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది భక్తులు మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. నలంద జిల్లాలోని మాఘ్రా గ్రామంలో ఈ ఆలయం ఉంది. చైత్రమాసంలో చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. "ప్రతి మంగళవారం ఇక్కడ రద్దీ నెలకొంటుంది. మేం దర్శనం కోసం పట్నా నుంచి వచ్చాం. కానీ ఉన్నట్టుండి తోపులాట జరగడంతో పలువురు చనిపోయారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది" అని మమతాదేవి అనే భక్తురాలు మీడియాకు వెల్లడించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# మా దగ్గర కొంటారా..? హర్మూజ్‌కు వెళ్తారా..?

### దేశాలకు ట్రంప్ వార్నింగ్



వాషింగ్టన్, మార్చి 31 : పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్‌లో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలతో పాటు ఈ యుద్ధంలో అగ్రరాజ్యం పిలుపును నిరాకరించిన పలు దేశాలనుద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. "హర్మూజ్ జలసంధి కారణంగా ఇంధనం కొరత ఎదుర్కొంటున్న దేశాలకు.. ఇరాన్‌పై చేస్తోన్న యుద్ధంలో కలిసిరాని యూకే వంటి దేశాలకు నాదొక సూచన. మొదటిది.. అమెరికా నుండి చమురు కొనాలి. అది మా దగ్గర పుష్కలంగా ఉంది. రెండవది.. కొంత ఆలస్యమైనా ధైర్యం కూడగట్టుకుని ఆ జలసంధికి వెళ్లి.. దానిని స్వాధీనం చేసుకోండి. మీ కోసం మీరే పోరాడటం నేర్చుకోవాలి. మీరు మాకు అండగా రావడం లేదు.. అలాగే మీకు సహాయం చేయడా నికి అమెరికా మీతో రాదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. కష్టమైన పని పూర్తయింది.. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని పోస్టులో హెచ్చరించారు.

## హర్మూజ్‌పై ఇరాన్ పట్టు బిగింపు

టెహ్రాన్, 31: చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : బీఆర్ ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 29న సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4న హైదరాబాద్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నం.30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారని, ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర వ్యాఖ్యలు చేశారని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలున్నాయి. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30 గంటలకు విచారణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణకు సహకరించాలని కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# చేయుత కోసం అభాగ్యుల (ఆసరా) ఎదురుచూపు

ఖమ్మం, మార్చి 31 (పోలీస్ నిఘా) : భర్త దూరమై పిల్లల పోషణ భారమై ఆర్థిక కష్టాలు అనుభవిస్తున్న వితంతువులు కొందరు. వయసు పెరిగి కాలు చేతులు ఆడని స్థితిలోని వృద్ధులు మరికొందరు. అంధులు. బదిరులు. రహదారి ప్రమా దంలో కాళ్లు చేతులు కోల్పోయి దివ్యాం గులుగా మారిన వారు. ఒంటరి మహిళలు వివిధ వృత్తిదారులు.రోగులు, సర్కార్ అందించే చేయుత (ఆసరా) పింఛన్ కోసం నిరీక్షిస్తున్నారు. 2022 నవంబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో దరఖాస్తులు పట్టుకొని అధికారులు చుట్టు తిరుగుతున్నారు.జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయి ంచింది. రాష్ట్రంలో జూన్ 2 తేదీ నుంచి రెండు లక్షల మందికి పెన్షన్లు ఇచ్చే అవ కాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి ఈ మేరకు ఇప్పటివరకు వచ్చిన దరఖా స్తులను పరిశీలించాలని



జిల్లాల అధికా రులను ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పాయి ఆ డేటాను ప్రభుత్వం తీసుకుంటుందని వివరించారు అయితే తొలుత వితంతు పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు ఇందుకోసం గ్రామాల్లోని చనిపోయిన వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

**దరఖాస్తులు వందలలో వేలల్లో పెండింగ్...**

ఖమ్మం అర్బన్ మండలంలో 3600. ఖమ్మం రూరల్ లో 626. వైరా 627. మధిర 930. ముదిగొండ 971.ఏన్కూరు 515. కూసుమంచి 626. కారేపల్లి 988. పెనుబల్లి 907. తల్లాడ 13 71. ఎర్రు పాలెం 580. సత్తుపల్లి 1000. చింతకాని 1155. ఏంసూరు 960. కల్లూరు 489. కామేపల్లి 650. బోనకల్లు 1500. రఘునాథపాలెం 353. కొణిజర్ల 720. తిరుమలయాపాలెం 1035. నేలకొండపల్లి మండలం 1070. దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. ప్రభుత్వం లాగిన్ అవకాశం కల్పిస్తే జిల్లా కేంద్రానికి అటు నుంచి రాష్ట్రానికి చేరుతాయి. వీరే కాకుండా ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో పింఛన్ ఇప్పించాలంటూ అధికారులను ఆశ్రయి స్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026- 27బడ్జెట్లో 2 లక్షల మందికి పెన్షన్ ఇస్తామని ప్రకటించడంతో ఆశగా ఎదు రుచూస్తున్నారు.

# ఘనంగా మహాలక్ష్మి పథకం విజయోత్సవాలు

**మహిళల ప్రయాణ ఖర్చు ఆదా రూ.10,012 కోట్లు దాటింది**



యాదగిరిగుట్ట, మార్చి 31(పోలీస్ నిఘా): మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని అందిస్తున్న మహాలక్ష్మి పథకం విజయోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రం భువనగిరి బస్ స్టాండ్‌లో ఘనంగా సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆదా చేసిన ప్రయాణ ఖర్చు రూ.10,012 కోట్లు దాటిన సం దర్భంగా కార్యక్రమం ఉత్సాహంగా జరి గింది. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎ. భాస్కర్ రావు, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ అవైస్ చిస్తీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి, ఆర్‌డీఓ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ మహిళల స్వేచ్ఛా ప్రయాణం తెలంగాణకు గర్వకా రణం అని పేర్కొంటూ, ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సేవలను కూడా మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా జిల్లాలో ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక బస్సు కొనుగోలు చేయడానికి సెర్ప్ నుండి అనుమతులు వచ్చాయని తెలిపారు. ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ప్రతి నెల రూ. 69,500 చొప్పున ఆదాయం మహిళా సమాఖ్య ఖాతాల్లో జమ అవుతుందని చె ప్పారు. అదనంగా జిల్లాలో మహిళలకు రూ.611 కోట్ల రుణ లక్ష్యానికి గాను రూ. 632 కోట్ల రుణాలు మంజూరు చేయగా, 99 శాతం రుణాలు సకాలంలో చెల్లిస్తు న్నారని వెల్లడించారు. ఆర్‌డీఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉచిత ప్రయాణం ద్వారా ఆదా అవుతున్న టికెట్ ఖర్చును ప్రతి మహిళ ఒక హుండీలో దాచుకుని, సం వత్సరం చివరలో వాటిని అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ కొండల్ రావు, ఆర్టీసీ డీఎం సి.హెచ్ మురళీకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శి పల్లవి, కోశాధికారి అలివేలు, అడిషనల్ డీఆర్‌డీఓ కోట జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ క్యాండీ మరియు లస్సీ తయారు చేస్తున్న కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడి

**రూ. 5,44,290/- విలువైన సామాగ్రి స్వాధీనం... ఒకరి అరెస్ట్**



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : మెహిదీపట్నం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ క్యాండీలు మరియు లస్సీ తయారు చేస్తున్న కేంద్రంపై కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (గోల్కొండ జోన్) బృందం, మెహిదీపట్నం పోలీసులతో కలిసి ఉమ్మడిగా దాడి చేసింది. ఈ దాడిలో భారీగా నిల్వ ఉంచిన ఐస్ క్యాండీలు, లస్సీ ప్యాకెట్లు మరియు తయారీకి ఉపయోగించే యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడి వివరాలు: సయ్యద్ ముషారఫుద్దీన్ (24 సంll): నివాసం: అహ్మద్ నగర్, ఫస్ట్ లాన్సర్, మెహిదీపట్నం. ఇతను "అలియా ఐస్ క్రీమ్ పార్లర్" పేరుతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు: పోలీసులు నిందితుడి వద్ద నుండి మొత్తం రూ. 5,44,290/- విలువైన ఈ క్రింది వస్తువులను స్వాధీనం చేసుకున్నారు:

1.ఐస్ క్యాండీ ప్యాకెట్లు: 92 (మొత్తం 16,560 క్యాండీలు).

2.లస్సీ క్యాండీ ప్యాకెట్లు: 20 (మొత్తం 4,200 క్యాండీలు).

3.లస్సీ గ్లాసులు: 300.

4.పెరుగు: 15 బకెట్లు (ఒక్కొక్కటి 10 కిలోలు).

5.చక్కెర: 50 కిలోలు.

6.యంత్రాలు: లస్సీ మెషిన్ (01), ఐస్ క్యాండీ మెషిన్ (01), ప్యాకింగ్ మెషిన్లు (03), హ్యాండ్ ప్యాకింగ్ మెషిన్లు (02), లస్సీ గ్లాస్ ప్యాకింగ్ మెషిన్ (01).

7.రిఫ్రిజిరేటర్లు: 06 (భారీ సైజువి).

8.రసాయనాలు: సిట్రిక్ యాసిడ్ (8 కిలోలు), సుక్రోజ్ (500 గ్రాములు), వివిధ రకాల ఫ్లేవర్లు.

కేసు వివరాలు: నిందితుడు సయ్యద్ ముషారఫుద్దీన్ మెహిదీపట్నంలోని అహ్మద్ నగర్ వద్ద "అలియా ఐస్ క్రీమ్ పార్లర్" పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అధిక లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తూ అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఐస్ క్యాండీలు మరియు లస్సీని తయారు చేస్తున్నాడు. తక్కువ ధరకు ఆశపడే అమాయక ప్రజలను మోసం చేస్తూ ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో Cr.No. 83/2026,



U/Sec: 274, 275, 125 BNS కింద కేసు నమోదు చేయబడింది. హైదరాబాద్ సిటీ పోలీస్ అడిషనల్ డిసిపి శ్రీ అందె శ్రీనివాసరావు గారి పర్యవేక్షణలో, గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఆర్. వెంకటేష్, మెహిదీపట్నం ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎస్. మల్లేష్, ఎస్.ఐ లు విజయానంద్, ప్రీతి మరియు వారి సిబ్బంది ఈ దాడిని విజయవంతంగా నిర్వహించారు.

# అక్రమ సంబంధం కోసం అమానుషం

**భార్య, ఇద్దరు కుమారులను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన భర్త**



చెన్నారావుపేట, మార్చి 31 (పోలీస్ నిఘా) : హైదరాబాద్ నగరంలోని మూసాపేట పరిసర ప్రాంతంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని భావించి కట్టుకున్న భార్యతో పాటు ఇద్దరు చిన్న కుమారులను హత్య చేసి, అనంతరం ఆ ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించిన దారుణ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం, వరంగల్ జిల్లా చెన్నారా వుపేట మండలం బోడ మా ణిక్యం తండాకు చెందిన బోడ స్రవంతి-ప్రవీణ్ దంపతులకు ఇద్దరు కుమా రులు ఉన్నారు. బోడ ప్రవీణ్, అదే తండాకు చెందిన బానోతు బద్రి-బిఖ్యా దంపతుల రెండో కుమార్తె స్రవంతిని ప్రేమ వివాహం చేసుకు న్నారు. దాదాపు 14 సంవత్సరాల పాటు వారి దాంపత్య జీవితం సజావుగా సాగినప్పటికీ, గత రెండు సంవత్సరా లుగా ప్రవీణ్ మరో మహిళతో అక్రమ సంబం ధం పెట్టుకుని భార్యను చిత్రహింసలకు గురి చేస్తున్నట్లు సమా చారం. ఇదే క్రమంలో ఆ మహిళను రెండో వివా హం చేసుకున్న ప్రవీణ్, భార్యతో తరచూ గొడవ లు పడు తూ దూరంగా ఉండేవాడు. కుటుంబ పెద్దలు పలుమార్లు పంచాయతీ నిర్వహిం చినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. రెండు రోజుల క్రితం నర్సంపేట ప్రాంతంలో మరోసారి పంచాయతీ జర గగా, ఇకముందు ఎలాంటి సంఘటనలు జరిగినా పూర్తి బాధ్యత తనదే నని ఒప్పు కొని, బాండ్ పేపర్ రాసి భార్యను తనతో తీసుకెళ్లాడు. అయితే ఇదంతా ముం దే పథకం ప్రకారమే జరిగిందనే అనుమా నాలు వ్యక్తమవు తు న్నాయి. సోమవారం హైదరాబాద్‌కు వెళ్లిన అనంతరం, మంగళ వారం రాత్రి భార్యను చిత్రహింసలకు గురి చేసి, బిర్యానీలో విషం కలిపి ఇద్దరు కుమా రు లతో పాటు భార్యను హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. అనంతరం వారిని ఉరివేసుకుని ఆత్మహ త్య చేసుకు న్నట్లు చిత్రీకరించినట్టు పోలీసులు అనుమాని స్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు కొనసా గిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పరామర్శ



దేవరకొండ, మార్చి 31 (పోలీస్ నిఘా) : దేవరకొండ నియోజకవర్గం వ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకున్న విషాదకరమైన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్ మంగళవారం పరామర్శించారు.నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల విషయం తెలిసిన వెంటనే ఆయన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పోస్టుమార్టం కోసం ఉంచిన మృతదేహాలకు నివాళులు అర్పిస్తూ...వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ కఠిన సమయంలో తాము ఒంటరిగా లేరని వారికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం వారి వెంటే ఉ ంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్లు, పోలీసు అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రమాదాలకు గల కారణాలను సమగ్రంగా పరిశీలించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.ప్రభుత్వం ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని, వారికి అవసరమైన సహాయం అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా అదనపు ఎస్పీకి ఎస్పీగా ప్రమోషన్

మెదక్, మార్చి 31 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ గారికి ఎస్పీగా ప్రమోషన్ లభించింది. ప్రమోషన్ పొందిన ఆయనను సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, మహేందర్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.




## వేములవాడ రాజన్న గోశాలలో

# కోడెల వరుస మృతి

**గోశాల నిర్వహణపై తీవ్ర విమర్శలు**

**సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుల డిమాండ్**

వేములవాడ, మార్చి 31 (పోలీస్ నిఘా) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కోడెల మృతి ఘటన మరోసారి కలకలం రేపింది. రాజన్న ఆలయంలో భక్తులు స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన మొక్కుగా సమర్పించే కోడెలు దేవస్థానానికి ముఖ్య ఆదాయ వనరుగా ఉండగా, వాటి వరుస మృతులు భక్తుల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయి.గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో గోశాలలో సిబ్బంది పెంపు, మెరుగైన సదుపాయాల ఏర్పాట్లు చేపట్టామని దేవస్థాన అధికారులు ప్రకటించారు.అయితే తాజా ఘటనతో ఆ చర్యలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోడెల సంరక్షణలో లోపాలు ఉన్నాయనే అభిప్రాయాన్ని భక్తులు వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు.





దేవస్థానంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ, కోడెల సంరక్షణలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. భక్తులు విశ్వాసంతో సమర్పించే కోడెలు మృత్యువాత పడటం బాధాకరమని పేర్కొన్నారు.ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేసారు. గోశాల నిర్వహణలో పారదర్శకత పెంపుతో పాటు, కోడెల సంరక్షణకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని వారు కోరారు.

# 38 ఏళ్ల అంకితభావం

**ఉపాధ్యాయురాలు రెబెకా సదానందానికి ఘన వీడ్కోలు**

**ముఖ్య అతిథిగా హాజరై సన్మానించిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్**




దేవరకొండ, మార్చి 31 (పోలీస్ నిఘా) : 38 సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలందించి మంగళవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న శ్రీమతి రెబెకా సదానందం గారిని గౌరవప్రదంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... అట్టడుగు వర్గాల నుండి విద్యను ఆయుధంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన శ్రీమతి రెబెకా సదానందం మూడు దశాబ్దాలకు పైగా కాలం పాటు అపారమైన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన మహనీయురాలని కొనియాడారు. గ్రామీణ ప్రాంత బాలికలకు విద్యా ప్రాధాన్యతను చాటి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని ఆయన అభినందించారు.ఇలాంటి అంకితభావం కలిగిన ఉ పాధ్యాయులు సమాజానికి ఆదర్శమని, వారి సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, ఉ పాధ్యాయుల పాత్రను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.అనంతరం శ్రీమతి రెబెకా సదానందం గారికి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాలతో సన్మానం చేసి, విశ్రాంత జీవితం ఆరోగ్యకరంగా, సుఖ శాంతియుతంగా కొనసాగాలని ఆయన కాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ ఆలంపల్లి నర్సింహా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి మురళి, ఎంఇఓ మాత్రు నాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ నిఘా
సంపాదకీయం | బుధవారం | 01 ఏప్రిల్ 2026

# భయపెడుతున్న గ్యాస్ బండ

మారుమూల పల్లెల నుండి మొదలుకొని పేరు మోసిన పట్టణాల్లో సైతం గ్యాస్ సిలిండర్ల వాడకం విరివిరిగా కొనసాగుతుంది. కానీ ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల వాడకదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్యాస్ వినియోదారుల అవస్థలు అంత పట్టకుండా ఉండే పరిస్థితులు నేడు దాపరించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతుండడమే వంటగ్యాస్ కొరతకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ యుద్ధాల వల్ల గ్యాస్ ఉత్పత్తుల్లో, అంతర్జాతీయ సరఫరా ప్రభావితం అవుతుంది. రష్యా , ఉక్రెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఎల్‌పీజీ, నాచురల్ గ్యాస్, కొద్దిపాటి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల విదేశీ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సరఫరా తగ్గుముఖం పట్టడం వల్ల గ్యాస్ సిలిండర్ డిమాండ్‌పై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. భారతదేశంలో ఎల్‌పీజీ గ్యాస్ దిగుమతి ఆధారిత వనరుగా ఉంది. తద్వారా కొన్ని దేశాల నుండి ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉంది. దీనివల్ల ఎల్‌పీజీ గ్యాస్ కొరత గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిస్థాయిలో లేక సతమతమవుతున్నారు. వృద్ధులు, నిరాక్షరాస్యులు ఎలా గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. స్థానిక ఎల్‌పీజీ డీలర్ల వద్ద నిల్వలు తగ్గడం వల్ల ఫోన్ లేదా ఆన్లైన్ బుకింగ్ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి రావడం చాలా కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం బుక్ కావడం కూడా ఒక సవాలుగా దాపరించింది. టోల్ ఫ్రీ నెంబర్, ఐవిఆర్ఎస్, యాప్, ఇలా ఎన్నో రకాలుగా ఉన్న ప్రత్యామ్నాయాల ద్వారా కూడా ప్రయత్నం చేసినా బుక్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో చాలామంది ప్రజలు మళ్ళీ పూర్వ కాలపు విధానాల ఏర్పాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వంట చెరుకు, గోబర్ గ్యాస్, విద్యుత్ వాడకపు సాధనాలను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఎల్‌పీజీ మార్కెట్‌పై అనూహ్య ప్రభావాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇలానే యుద్ధం కొనసాగితే ధరలు అనియంత్రితంగా పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్ల వద్ద స్టాక్ తక్కువ ఉండడం వలన గ్యాస్ సిలిండర్ల ధర విషయంలో చేతివాటం చూపిస్తున్నారు. వాణిజ్య కేంద్రాలైన హోటల్, రెస్టారెంట్లు, హాస్టల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై గ్యాస్ సిలిండర్లను వారికి నచ్చిన ధరలతో సరఫరా చేస్తూ గృహ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి విషయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలను పర్యవేక్షిస్తూ స్టాక్ రికార్డులను పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాల వద్ద సామాన్య ప్రజలు తమ పనులను వదులుకొని గంటల తరబడి వేచి ఉండి ప్రాధేయపడిన వారికి సరైన సమాధానం చెప్పే నాధుడు కరువయ్యాడు. ప్రభుత్వ అధికారులు వినియోగదారుల పరిస్థితులను వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

## తూతూ మంత్రంగా అసెంబ్లీ సమావేశాలు: హరీష్‌రావు



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : శాసనసభ సమావేశాలు ఒక దిశా నిర్దేశం లేకుండా ముగిశాయని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలపై స్పష్టత వస్తుందని, ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన ప్రజలకు ప్రభుత్వం తీవ్ర నిరాశనే మిగిలించిందన్నారు. బడ్జెట్, బిల్లులు పాస్ చేసుకోవడానికి, రాజ్యాంగ అనివార్యతను పూర్తి చేయడానికి మాత్రమే తూతూ మంత్రంగా సభను నడిపారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చించడానికి ప్రభుత్వం ముందుకు రాలేదు. 19 సమస్యలపై షార్ట్ డిస్కషన్ కోసం బీఆర్ఎస్ నోటీసులు ఇచ్చినా ఏ ఒక్క అంశంపైనా ప్రభుత్వం చర్చకు రాలేదు. చేసిన మంచి పనులు చెప్పుకోవడానికి ఒక్క ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కూడా లేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్షాలు అడిగిన ప్రజా సమస్యల మీద సూటిగా సమాధానం చెప్పకుండా తొండల భాష, కండల భాష వాడారు. ప్రభుత్వం డిఫెన్స్‌లో పడ్డప్పుడల్లా ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగడం, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరేమీ లేదు. ప్రజల పక్షాన ప్రశ్నించడానికి ప్రతిపక్షం ఉంటుంది. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నించడమే ప్రతిపక్ష బాధ్యత. ఆ బాధ్యతను బీఆర్ఎస్ నిర్వహిస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతోంది. ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా ఎత్తివేసింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం రోజు, ఆర్థిక మంత్రి బడ్జెట్ పెట్టిన రోజు ప్రశ్నోత్తరాలు లేవు. ప్రతిపక్షాల ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారు. ఏ ఒక్కరోజు కూడా అసెంబ్లీని సమయానికి ప్రారంభించలేదు. సమయపాలన లేదు, సభ అంటే గౌరవం లేదు. అసెంబ్లీలో టీ బ్రేక్ 10 నిమిషాలు, లంచ్ బ్రేక్ అరగంట ఉంటుంది. కానీ, ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి వస్తున్నాడని ఏకంగా 4 గంటలు టీ బ్రేక్ ఇచ్చారు. ఫైనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని 3 గంటలపాటు సభను ఆపారు. ప్రిపరేషన్ ఇంట్లో చేసుకోవాలి కానీ సభకు వచ్చాక చేస్తారా.. కావాలనే లేట్ నైట్ వరకు సభ నడిపి సభ్యులు లేకుండా చేయాలని చూశారు. వారం రోజులు సభను ఎక్స్‌టెండ్ చేయమని అడిగినా ప్రభుత్వం ముందుకు రాలేదు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం అసెంబ్లీని 30నే హడావుడిగా ముగించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు, ప్రజా సమస్యలు ముఖ్యమా? లేక కేరళ ప్రచారం ముఖ్యమా అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో సభలో బయటపెడితే ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడ్డారు. రవీంద్రభారతిలో నాటకాలు వేశారు. అవినీతి నుంచి మంత్రిని కాపాడటానికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజులపాటు సస్పెండ్ చేసి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకున్నారు. హేట్ స్పీచ్ బిల్లును చివరి రోజు తెచ్చి చర్చ లేకుండానే ముగించారు. పద్దులన్నీ చివరి రోజు గిలెటిన్ చేసుకొని పారిపోయారు. ఇరిగేషన్ పద్దు మీద కూడా కనీస చర్చ లేకుండా పాస్ చేసుకున్నారు. హౌస్ కమిటీ పనికిరాదని చెప్పి శాసనసభ్యులకు, సభకు గౌరవాన్ని తగ్గించారన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇద్దరూ మా బడ్జెట్ చింపుతారా అని మాట్లాడుతున్నారు. మీ బడ్జెట్‌లో ఏమీ లేదు.. అది పూర్తిగా డొల్ల బడ్జెట్. కాబట్టే చింపి నిరసన వ్యక్తం చేశామన్నారు.

# వరుస యుద్ధాలలో ఫ్లాప్.. పనికిరాని సరుకు.. మేడ్ ఇన్ చైనాకు మరక




ప్రపంచ ఆయుధ మార్కెట్లో మూడో స్థానంలో ఉన్న చైనా, సరసమైన ధరలతో అనేక దేశాలను ఆకర్షిస్తోంది. కానీ ఇటీవల జరిగిన పలు యుద్ధ ఘట్టాల్లో డ్రాగన్ తయారీ ఆయుధాలు వరుసగా విఫలం కావడం, వాటి నాణ్యతపై తీవ్ర అనుమానాలను రేకెత్తించింది. మరోవైపు, 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా సాగుతున్న భారత రక్షణ రంగం మాత్రం నాణ్యత, విశ్వసనీయతలతో ప్రపంచ మార్కెట్లో దూసుకుపోతోంది

**చైనా ఆయుధాల వైఫల్యగాథలు**

2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ రక్షణ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. పాక్ వద్ద ఉన్న ఆయుధాల్లో 82 శాతం చైనా సరఫరా చేసినవే కావడం గమనార్హం. చునియన్ వైమానిక స్థావరంలోని చైనా తయారు చేసిన వైఎల్‌సీ-8ఈ 'యాంటీ స్టెల్త్' రాడార్‌ను భారత ఈఎల్ఎం-2090యూ గ్రీన్ పైన్ రాడార్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సాంకేతికతలు పూర్తిగా స్తంభింపచేశాయి. 450 కి.మీ. దూరం నుంచి స్టెల్త్ విమానాలను పసిగట్టగలదని చైనా ఊదరగొట్టిన ఈ వ్యవస్థ, భారత జామింగ్ చర్యల ముందు నిష్ప్రయోజనమైంది. లాహోర్ సమీపంలో మోహరించిన హెచ్‌క్యూ-9 భూతలం నుంచి గగనతల క్షిపణి వ్యవస్థ, అనుసంధాన సమస్యలు, ఎలక్ట్రానిక్ దాడులను ఎదుర్కోవడంలో బలహీనత కారణంగా బ్రహ్మోస్ క్రూజ్ క్షిపణులను అడ్డుకోలేకపోయింది. పాక్ యుద్ధవిమానం ప్రయోగించిన చైనా తయారు చేసిన పీఎస్-15ఈ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. దాని రాకెట్ మోటార్ మరియు మార్గనిర్దేశక వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి.

**వెనెజువెలాలో తుస్సు..**

జనవరి 2026లో అమెరికా దళాలు వెనెజువెలా అధ్యక్షుడు నివాసంపై దాడి చేసినప్పుడు, చైనా నుంచి ఆ దేశం కొనుగోలు చేసిన 2 బిలియన్ డాలర్ల విలువైన గగనతల రక్షణ వ్యవస్థలు పూర్తిగా నిష్క్రియావస్థలో ఉన్నాయి. దాడికి ముందే 22 రాడార్లలో 60 శాతం పనిచేయడం లేదు. విడిభాగాల కొరత, తుప్పుపట్టడం, పవర్ సిస్టమ్ సమస్యలు ఇందుకు కారణాలు. అమెరికా ఈఏ-18జీ గ్రౌలర్ యుద్ధవిమానాల జామింగ్ చర్యల ధాటికి జేవై-27ఏ 'మీటర్ వేవ్' యాంటీ స్టెల్త్ రాడార్లు, ఏఈఎస్ఏ రాడార్లు స్తంభించిపోయాయి. హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-12 క్షిపణి వ్యవస్థలు అమెరికా హెలికాప్టర్లను పసిగట్టడంలో లేదా అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయి.

**ఇరాన్ యుద్ధంలోనూ ఆయుధాల దుస్థితి**

తాజా గల్ఫ్ యుద్ధంలో ఇరాన్ వాడిన చైనా ఆయుధ వ్యవస్థలు మరోసారి నిరాశపరిచాయి. రష్యా ఎస్-400 స్థాయిలో పనిచేస్తుందని చైనా నమ్మబలికిన హెచ్‌క్యూ-9బీ క్షిపణి వ్యవస్థలు, అమెరికన్ స్టెల్త్ విమానాలు, ఏజీఎం-158సీ ఎల్ఆర్ఎస్ఎం ఆయుధాలను అడ్డుకోలేకపోయాయి. ఈ వ్యవస్థల్లోని సీకర్లు, రెండు దశల మోటార్లు ఇజ్రాయెల్ ఏఎల్‌క్యూ-322 జామర్ల ధాటికి తట్టుకోలేకపోయాయి.

**చైనా ఆయుధాల వైఫల్యానికి కారణాలు**

రక్షణ నిపుణుల విశ్లేషణ ప్రకారం, చైనా ఆయుధాల వైఫల్యానికి ప్రధాన కారణాలు చైనా ఆయుధాలు విదేశీ డిజైన్లకు కాపీలు మాత్రమే. బాహ్య డిజైన్‌ను కాపీ చేయడం సులభమే కానీ, లోపల ఉండే క్లిష్టమైన సాఫ్ట్‌వేర్, అల్గారిథమ్‌లను పునరుత్పత్తి చేయడం చైనాకు సాధ్యపడలేదు. ఈ ఆయుధాలను వాస్తవ యుద్ధ పరిస్థితుల్లో సరిగ్గా పరీక్షించకపోవడం వల్ల, లోపాలు బయటపడలేదు. ఆధునిక ఎలక్ట్రానిక్ యుద్ధ విధానాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను వేగంగా అప్‌డేట్ చేయడంలో చైనా వెనుకబడి ఉంది. వెనెజువెలా వంటి దేశాల్లో విడిభాగాల సరియైన సరఫరా లేకపోవడం వల్ల వ్యవస్థలు నిష్క్రియావస్థలో పడిపోయాయి. అమెరికా ల్యాబ్‌లు, రక్షణ కాంట్రాక్టు సంస్థలపై సైబర్ దాడులు నిర్వహించి రహస్య డేటాను తస్కరించడం ద్వారా చైనా ఈ సాంకేతికతలను సముపార్జించిందన్న ఆరోపణలు ఉన్నాయి.

**నాణ్యతకే భారత్ ప్రాధాన్యం..**

చైనాకు భిన్నంగా, భారత్ నాణ్యత, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఒకప్పుడు తన రక్షణ అవసరాల్లో 70 శాతాన్ని దిగుమతులపై ఆధారపడిన భారత్, ఇప్పుడు ఆత్మనిర్భరత దిశగా దూసుకుపోతోంది. గత దశాబ్దంలో భారత ఆయుధ ఎగుమతులు 30 రెట్లు పెరిగాయి. భారత సైనిక హార్డ్‌వేర్ 80కిపైగా దేశాలకు చేరుతోంది. 2029 నాటికి దాదాపు 50 వేల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలను ఎగుమతి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. చైనా ఆయుధాల వరుస వైఫల్యాలు, 'చవకైతే చాలు' అనే విధానం ఎంత ప్రమాదకరమో చాటిచెప్పాయి. మరోవైపు, నాణ్యత, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇస్తూ, స్వదేశీ సాంకేతికతపై దృష్టి సారించిన భారత్, ప్రపంచ ఆయుధ ఉత్పత్తి హబ్‌గా ఎదుగుతోంది.

# కుప్పకూలుతున్న దాయాది దేశం!



పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేస్తోంది. మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. చమురు ధరల పెరుగుదల ప్రభావంతో నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి. సామాన్యుడి బడ్జెట్ తలకిందులు అవుతోంది. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ద్రవ్యోల్బణంతో బాధపడుతున్న పాకిస్తాన్ పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తారస్థాయికి చేరుకోవడంతో, దేశం పూర్తి స్థాయి లాక్‌డౌన్ అంచున నిలిచింది.

**ఇంధన ధరల విస్ఫోటనం..**

పశ్చిమాసియాలోని యుద్ధ పరిణామాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు 30 శాతం పెరిగాయి. బ్యారెల్ ధర త్వరలోనే 100 డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో పాకిస్తాన్‌లో పెట్రోల ధర రూ.55 పెరిగింది. డీజిల్ ధర రూ.55 పెరిగింది. ఎల్‌పీజీ సిలిండర్ ధర 35 శాతం పెరిగి రూ.5,135కు చేరింది.

**అడుగంటుతున్న నిల్వలు..**

ప్రస్తుతం పాకిస్తాన్‌లో 11 రోజులకు సరిపడా చమురు నిల్వలు మాత్రమే ఉన్నాయి. చమురు కొరత కారణంగా విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించింది. ఉద్యోగుల పనిదినాలు తగ్గించింది. వర్క్‌ఫ్రం హోం అమలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ఇరాన్ దాడుల కారణంగా గల్ఫ్ దేశాల్లోని ఆయిల్ రిఫైనరీలు ధ్వంసమయ్యాయి, ఉత్పత్తి ఆగిపోయింది. ఈద్, నౌరోజ్ సెలవుల కారణంగా ఇరాన్ నుంచి గ్యాస్ సరఫరా గణనీయంగా తగ్గింది. దీంతో పాకిస్తాన్‌లో తీవ్ర సంక్షోభం నెలకొంది.

**లాక్‌డౌన్ దిశగా అడుగులు..**

ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్తాన్‌కు లాక్‌డౌన్ మినహా వేరే దారిలేదు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఇంధన సంక్షోభం తీవ్రతను గుర్తించి, పలు కఠిన నిర్ణయాలు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసివేసి, ఆన్‌లైన్ తరగతులకు మార్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులలో 50% మందిని ఇంటి నుంచే పని చేయాలని ఆదేశించారు. పంజాబ్, బలూచిస్తాన్ ప్రాంతాల్లో వారం పని దినాలను 5 నుంచి 4 రోజులకు తగ్గించారు. మంత్రుల జీతాల్లో 20 శాతం కోత విధించారు. ప్రైవేట్ వాహనాల వినియోగంపై పరిమితులు విధించారు. ప్రభుత్వ వాహనాల ఉద్యమం తగ్గించారు.

**జీడీపీకి భారీ దెబ్బ..**

నిపుణుల అంచనాల ప్రకారం చమురు సంక్షోభం పాకిస్తాన్ జీడీపీని 2 నుంచి 3 శాతం దెబ్బతీస్తుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగి, 40-45 శాతానికి చేరుకునే ప్రమాదం ఉంది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగనున్నాయి. ఉద్యోగాలు, విద్యా నాణ్యతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

**దౌత్యపరమైన ప్రయత్నాలు**

యుద్ధాన్ని ఆపేందుకు పాకిస్తాన్ దౌత్యపరమైన చర్యలు తీసుకుంటోంది. పశ్చిమాసియాలో శాంతి కోసం కృషి చేస్తోందని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. చర్చలకు మధ్యవర్తిత్వం వహించడానికి ముందుకొచ్చింది. చైనా, సౌదీ అరేబియా నుంచి ఆర్థిక సహాయం కోరుతోంది. ఐఎంఎఫ్‌తో అత్యవసర చర్చలు జరుపుతోంది. పాకిస్తాన్ ప్రస్తుతం తన చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. ఇరాన్ యుద్ధం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసింది. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలు తాత్కాలిక ఉపశమనం అందిస్తాయి కానీ, దీర్ఘకాలిక పరిష్కారం కాదు.

# కేరళ అసెంబ్లీ ఎన్నికలు.. యూడీఎఫ్, ఎల్డీఎఫ్ మధ్యే ప్రధాన పోటీ



కేరళలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. పదేళ్లుగా అధికారంలో ఉన్న ఏడీఎఫ్‌ను యూడీఎఫ్ ఓడించగలుగుతుందా. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్ర కేరళ. ఈసారి యూడీఎఫ్ గెలవకుంటే కాంగ్రెస్ మరో ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉండాల్సిందే. ఏడీఎఫ్ ఓడిపోతే కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న ఒక్క రాష్ట్రం కూడా పోతుంది. అయితే ఈసారి బీజేపీ కేరళలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 18 అసెంబ్లీ స్థానాల్లో మొదటి స్థానంలో నిలిచింది. వీటిలో 9 సీట్లు గెలిస్తే మూడో శక్తిగా అవతరిస్తుంది.

**బీజేపీని అడ్డుకునే వ్యూహం**

బీజేపీ ఎదుగుదలను అరికట్టేందుకు యూడీఎఫ్, ఎల్డీఎఫ్ తెరవెనుక ఏకమవుతున్నాయి. ఉత్తర కేరళలోని మంజేశ్వరం నియోజకవర్గం ఇందుకు నిదర్శనం. ఇక్కడ రెండుసార్లు వరుసగా యూడీఎఫ్ గెలిచింది, రెండో స్థానంలో బీజేపీ ఉంది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.సురేంద్రన్ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. 2021 ఎన్నికల్లో కేవలం 745 ఓట్ల తేడాతో, 2016లో 89 ఓట్లతో ఓడిపోయారు. ఈసారి ఆయనపై సానుభూతి ఉంది, యూడీఎఫ్ అభ్యర్థిపై వ్యతిరేకత ఉంది. దీంతో సురేంద్రన్ గెలుపుకు యూడీఎఫ్, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

**పోటీ నుంచి తప్పుకున్న ముస్లిం పార్టీలు..**

నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) వారసురాలు ఎస్డీపీఐ వామపక్ష కూటమితో జతకట్టింది. 139 సీట్లలో ఎల్డీఎఫ్‌తో ఉండగా, ఒక్క సీటులో మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు తెలిపింది. మంజేశ్వరంలో ఎల్డీఎఫ్ ఎస్డీపీఐకి టికెట్ ఇవ్వగా, అది పోటీ నుంచి తప్పుకుంది. మరో ముస్లిం పార్టీ ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షుడు కోయంబత్తూర్ అద్వానీ హత్య కుట్ర కేసులో ఉన్న వ్యక్తితో సంబంధం ఉన్న వ్యక్తి. పీడీపీ కూడా పోటీ నుంచి తప్పుకుని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. పంచాయతీ ఎన్నికల్లో యూడీఎఫ్-ఎస్డీపీఐ కలిసి పోటీ చేశాయి. ఇవన్నీ బీజేపీని అడ్డుకునే వ్యూహంలో భాగమే.


**బీజేపీ ఎదుగుదలకు సవాళ్లు**

2014లో 11 శాతం ఓట్లు వచ్చిన బీజేపీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 20 శాతం దాటింది. 18 స్థానాల్లో మొదటి స్థానంలో నిలిచింది. అమిత్ షా 40 శాతం ఓట్లు, సీఎం పదవి లక్ష్యంగా ప్రకటించారు. కానీ యూడీఎఫ్-ఎల్డీఎఫ్ ధ్రువీకరణ రాజకీయాలు బీజేపీ మార్గాన్ని అడ్డుకుంటున్నాయి. మంజేశ్వరం లాంటి చోట్ల ముస్లిం ఓట్లు చీలకుండా చూసుకుంటున్నాయి. స్థానిక ఎన్నికల్లో తిరువనంతపురం కార్పొరేషన్‌ను బీజేపీ గెలుచుకోవడం చారిత్రాత్మక విజయం.

**సర్వేలో యూడీఎఫ్ ముందంజ..**

తాజా సర్వేల ప్రకారం, యూడీఎఫ్ 81-86 సీట్లు, ఎల్డీఎఫ్ 51-59 సీట్లు, బీజేపీ 0-2 సీట్లు గెలిచే అవకాశం ఉంది. ఓటు శాతం: యూడీఎఫ్ 43-45 శాతం, ఎల్డీఎఫ్ 39-41 శాతం, ఎన్డీఏ 13-15 శాతం, ఉత్తర కేరళలో మలప్పురం వంటి జిల్లాల్లో యూడీఎఫ్ ఆధిక్యం, కన్నూర్, పాలక్కాడ్‌లో ఎల్డీఎఫ్ బలం కొనసాగుతుంది. మధ్య కేరళలో త్రిసూర్, ఎర్నాకులం జిల్లాల్లో యూడీఎఫ్‌కు అవకాశాలు మెరుగుగా ఉన్నాయి. సురేంద్రన్ గెలిస్తే కేరళలో బీజేపీ మూడో శక్తిగా నిలుస్తుంది, రాజకీయ సమీకరణాలు మారతాయి. యూడీఎఫ్ గెలిస్తే 10 ఏళ్ల తర్వాత అధికారం తిరిగి వస్తుంది. ఎల్డీఎఫ్ ఓడిపోతే కమ్యూనిస్టు పాలన ఒక్క రాష్ట్రంలో కూడా మిగలదు. స్థానిక ఎన్నికల్లో యూడీఎఫ్ గెలుపు (4 మున్సిపాలిటీలు) ఆశాజనకం. కానీ బీజేపీని అడ్డుకునే కూటమి ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారవచ్చు. మంజేశ్వరం ఫలితం కేరళ రాజకీయాల దిశను నిర్ణయిస్తుంది.

# హైదరాబాద్‌లోని జయలలిత నివాసం సీజ్



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన ఇల్లు సీజ్ అయింది. హైదరాబాద్‌లో ఉన్న ఆమె ఇంటిని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆమె ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఫిబ్రవరిలోనే ఆస్తిపన్ను బకాయిలపై నోటీసులు జారీ చేశారు. అయితే జయలలితకు సంబంధించివారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ క్రమంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న జీ+4 భవనాన్ని సీజ్ చేశారు. ఈ ఇంటికి సంబంధించి 2017 నుంచి సుమారు రూ.83 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని సమాచారం. నిన్న(సోమవారం) జీహెచ్ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది జయలలిత ఇంటిని సీజ్ చేశారు. మార్చి 31 వరకు ఓటీఎస్ స్కీమ్ అందుబాటులో ఉందని, ఆ రాయితీ పోగా మొత్తం రూ.82,91,822 మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### మండల అధ్యక్షుడు సిద్దన రమేష్, గ్రామ సర్పంచ్ దారా రంజిత్



చెన్నారావుపేట, మార్చి 31 (పోలీస్ నిఘా) : గ్రామాల అబి వృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ దారా రంజిత్ లు అన్నారు.చెన్నరావుపేట మండలంఅమీనాబాద్ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారం తోఈ జీఎస్ నిధులు 20లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టా రు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ గ్రామ సర్పంచ్ దారా రంజిత్ కొబ్బరికాయ కొట్టి పను లని ప్రారంభిం చారు.ఈ సందర్భంగా గ్రామ అభి వృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోం దని సీసీ రోడ్డు నిర్మా ణాన్ని ఎమ్మెల్యే దొంతి సహకారంతో చేపడుత మని మండల అధ్యక్షు డు సిద్దన రమేష్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అబి వృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని గత ప్రభు త్వం మాటలకే పరిమి తమైందని జీవో లేని రోడ్లు మంజూరి చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని ప్రజా ప్రభుత్వం చెప్పిందే చేస్తుందని చేసేదే చెప్తుందని ఆయన అన్నారు.. గ్రామ సర్పంచ్ దారా రంజిత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో గ్రామాల అబివృద్ధి కుంటు పడిందని ప్రజా పాలనలో గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తోందని వారు అన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన సమావేశం




మందమర్రి, మార్చి 31 (పోలీస్ నిఘా) : మందమర్రి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 2026 కార్యక్రమానికి సంబంధించి మండల తహసీల్దార్ సతీష్ కుమార్ సమావేశంలో వివరాలు తెలియజేశారు.మండలంలోని ప్రతి ఓటరు తమ ఓటరు గుర్తింపును తప్పనిసరిగా సరిచూసుకుని, బూత్ లెవల్ ఆఫీసర్ కు ఎన్యూమరేటర్ ఫారంలో పూర్తి వివరాలతో సమర్పించాలని ఆయన సూచించారు. ఓటరు గుర్తింపు కార్డులో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే వాటిని సరిచేసుకోవాలని తెలిపారు.బూత్ స్థాయిలో సహాయకులుగా పని చేయడానికి బూత్ లెవల్ ఏజెంట్లు ను నియమిస్తారని, వారి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు పాల్గొని సహకరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన మానవ హక్కుల సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పవన్



టేక్మాల్, మార్చి 31 (పోలీస్ నిఘా) : మెదక్ జిల్లా టేక్మాల్ మండలానికి చెందిన మానవ హక్కుల సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పవన్ సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గారిని మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి మానవ హక్కుల గురించి మాట్లాడడం జరిగింది దానికి ఎస్పీ స్పందించి ప్రజల హక్కులను ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిత తనికి చేసిన లింగగిరి గ్రామ సర్పంచ్ మేడబోయిన రజిత కుమార్



చెన్నారావుపేట , మార్చి 31 (పోలీస్ నిఘా) : మండలంలోని లింగగిరి గ్రామ ంలో అంగన్వాడి కేంద్రంలో ఈరోజు తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలన చేయడం జరిగినది అలాగే గర్భిణీ స్త్రీలకు మరియు చిన్న పిల్లలకు వారికి అంద వలసిన పోషక ఆహార పదార్థాలను గుడ్లు పాలు ఇతర మెనూలు సక్రమంగా అందిం చాలని వారికి సూచన చేయడం జరిగినది.

## కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి

### -ఉన్నతాధికారుల నిర్లక్ష్యం పై బంధువుల నిరసన-




వరంగల్, మార్చి 31 (పోలీస్ నిఘా): గ్రేటర్ వరంగల్ ఎన్డీసీఎల్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. హనుమకొండ యాదవ నగర్ యూనిట్‌లో క్యాజువల్ కట్టర్‌గా పనిచేస్తున్న గాదె పున్నం చంద్ర కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాల ప్రకారం, సోమవారం హనుమకొండ గుండ్లసింగారం బీసీ కాలనీ వద్ద మరమ్మతుల పనులు నిర్వహిస్తుండగా, విద్యుత్ సరఫరా కొనసాగుతుండగానే పున్నం చంద్రను పోల్ ఎక్కించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కరెంట్ షాక్ తగలడంతో అతను కిందపడిపోయి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని వెంటనే నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ ముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తక్షణ పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

# హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి

### ద్విచక్ర వాహనాల వల్లే అధిక ప్రమాదాలు

### జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు

### చేగుంటలో "ఎర్రివ్ అలివే" కార్యక్రమం.. ఉచిత కంటి పరీక్షలు



మెదక్, మార్చి 31 (పోలీస్ నిఘా) : మెదక్ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మెదక్ జిల్లా చేగుంట పోలీస్ స్టేషన్‌లో "ఎర్రివ్ అలివే " కార్యక్రమం లో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు అధికంగా గురవుతున్నారని, హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రైడర్‌తో పాటు పిలియన్ కూడా (ఐఎస్ ఐ) ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు కేవలం గణాంకాలు కాదని, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం బాధ, కన్నీరు దాగి ఉంటుందని అన్నారు. నిర్లక్ష్యం, అసావధానం కారణంగా ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. అలాగే అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని తెలిపారు.చివరగా, ప్రమాదాలు విధి కాదని?మన నిర్లక్ష్య ఫలితమేనని స్పష్టం చేస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి తమ కుటుంబాలను రక్షించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డియస్పీ నరేందర్ గౌడ్, సిఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# కలుషిత అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

### నిందితుడి అరెస్ట్



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో కలుషితమైన అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్) మరియు హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా అరెస్ట్ చేశాయి.

కేసు వివరాలు: నమ్మదగిన సమాచారం మేరకు, పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పి.ఎస్ పరిధిలోని 'ఎస్‌కెఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్' (ప్లాట్ నెం. 25, నాఇఎఇ, ఐడిఏ కట్టెదాన్) పై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడైన హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంత నివాసిగా గుర్తించబడ్డాడు.

తయారీ విధానం మరియు అక్రమాలు: అపరిశుభ్ర వాతావరణం: అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులలో ప్లాస్టిక్ డబ్బాల్లో ఈ పేస్ట్‌ను తయారు చేస్తున్నారు.

నాణ్యత లేని ముడి సరుకులు: నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి కలుషితం చేస్తున్నారు.

రసాయనాల వినియోగం: పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్ మరియు గ్జాంతమ్ గమ్ పౌడర్ వంటి రసాయనాలను కలుపుతున్నట్లు గుర్తించారు.

ఆరోగ్యానికి ముప్పు: ఈ కలుషిత పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం వల్ల దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు గమనించారు. దీనిని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడు.

నిబంధనల ఉల్లంఘన: ఆహార భద్రతా ప్రమాణాల సర్టిఫికేట్ లేకుండా, కేవలం లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.

సీజ్ చేసిన వస్తువులు (మొత్తం విలువ సుమారు రూ. 22,00,000/-):

తయారు చేసిన పేస్ట్: సుమారు 4,032 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ (వివిధ ప్యాకెట్లలో).

ముడి సరుకులు: 6,000 కిలోల నాణ్యత లేని వెల్లుల్లి, 210 కిలోల నాణ్యత లేని అల్లం మరియు వెల్లుల్లి పొట్టు సంచులు.

ఇతరాలు: 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్ మరియు 5 గ్రైండింగ్ యంత్రాలు.

చర్యలు: అరెస్టయిన నిందితుడిని, సీజ్ చేసిన సామాగ్రిని తదుపరి చర్యల నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. రాఘవేందర్, ఎస్సై శ్రీకాంత్, మైలార్‌దేవ్‌పల్లి ఎస్సై విశ్వనాథ్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగి ఉద్యోగ జీవితంలో పదవి విరమణ అనేది సహజం

### పదవి విరమణ పొందుతున్న అధికారులు మొగులయ్య, ఎస్ఐ, ఖధీరుద్దీన్ ఆర్.ఎస్ఐ, శ్రీనివాస్ రెడ్డి పిసి లను ఘనంగా సత్కరించి.. వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, మార్చి 31 (పోలీస్ నిఘా) : మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవి విరమణ కార్యక్రమంలో మొగులయ్య (ఎస్ఐ), ఖదీరుద్దీన్ (ఆర్ఎస్ఐ), శ్రీనివాస్ రెడ్డి (పీసీ)లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ మొగులయ్య, ఎస్ఐ - (1987) సంవత్సరంలో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమై, ఉమ్మడి జిల్లాలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో ధైర్యసాహసాలతో విధులు నిర్వహించి, సమర్థవంతంగా సేవలందిస్తూ సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ సబ్-ఇన్స్పెక్టర్‌గా ఎదగడం వారి కృషికి నిదర్శనం అన్నారు. నారాయణఖేడ్, సంగారెడ్డి, జోగిపేట, వంటి పోలీసు స్టేషన్‌లలో సమర్థవంతంగా విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారని పేర్కొన్నారు.సయ్యద్ ఖదీరుద్దీన్ (ఆర్ఎస్ఐ) (1983) సంవత్సరంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి, కంమాండెంట్ రైటర్ గా, డిఎస్పీ రైటర్ గా, ఆర్.ఐ రైటర్ గా, ఉమ్మడి మెదక్ జిల్లాలోని సాధారణ విధులను నిర్వహిస్తూ తనకు కేటాయించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించారని తెలిపారు. సర్వీస్ మొత్తంలో ఏ చిన్న రిమార్క్ లేకుండా, ఉన్నతాదికారుల నుండి రివార్డ్ లను అందుకుంటూ, అంచెలంచెలుగా పదోన్నతులు పొంది ఆర్మ్‌డ్ సబ్-ఇన్స్పెక్టర్ హోదాకు చేరడం వారి ప్రతిభకు నిదర్శనం అన్నారు.

## గోశాల ఆవరణలో కొలువుదీరుతున్న వనం

### యాదగిరిగుట్టలో ఎస్పీఎఫ్ అధికారుల పర్యావరణ స్ఫూర్తి: శేషగిరిరావు




యాదగిరిగుట్ట, మార్చి 31 (పోలీస్ నిఘా) : తెలంగాణ ప్రభుత్వ 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, మంగళవారం తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా ఆదేశాల మేరకు కమాండంట్ ఎన్. త్రినాథ్ సూచనల మేరకు కొండ కింద దేవస్థానానికి చెందిన మల్లపురంలోని గోశాల ఆవరణలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీఎఫ్ విభాగం ఇప్పటికే సంరక్షిస్తున్న గార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ ఎన్ నరసింహమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శేషగిరిరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎస్పీఎఫ్ విభాగం మొక్కల పెంపకానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఎస్ ఐ రవి ఏఎస్ఐ లు శ్రీనివాస్ రెడ్డి రాజయ్య కనకయ్య మాణిక్ ప్రభు సిబ్బంది మోహన్ రెడ్డి గోపీనాయక్ మురళి యాదగిరి వీరేష్ శ్రీకాంత్ రెడ్డి కృష్ణ మహేష్ రమేష్ సత్యసాగర్ సతీష్ అనిల్ సందీప్ రెడ్డి సిద్ధులు దుర్గ కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాల పాటించడంతోనే ప్రమాదాల నివారణ



చేవెళ్ల, మార్చి 31 (పోలీస్ నిఘా) : ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని చేవెళ్ల ఎస్ఐ వనం శిరీష తెలిపారు. తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా నాంచేరి గ్రామంలో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో జరిగిన ఈ ర్యాలీలో పోలీసులు, యువకులు పాల్గొని హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, చిన్నచిన్న జాగ్రత్తలతో ప్రాణనష్టం నివారించవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి భద్రతపై చైతన్యం విస్తరించడమే లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులుమామిడి అశోక్, గ్రామస్తులు జయశంకర్ గౌడ్, పులుమామిడి శేఖర్, నర్సింలు, మల్లేష్, రాజలింగం గౌడ్, శివలింగం గౌడ్, రాఘవేందర్ గౌడ్, శంకర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు: జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్



సంగారెడ్డి, మార్చి 31 (పోలీస్ నిఘా) : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి 30 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ గారు సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## తల్లి జ్ఞాపకార్థం అనాథలకు అన్నదానం

### సమాజానికి సేవే నా బాధ్యత: పోతురాజు మల్లేష్





చేవెళ్ల, మార్చి 31 (పోలీస్ నిఘా) : సమాజానికి తోడ్పాటు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని పోతురాజు మల్లేష్ అన్నారు. తల్లి సత్యమ్మ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డుకు చెందిన ఆయన మంగళవారం శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలోని వాల్మీకి గురుకులం ఆశ్రమంలో అనాథ పిల్లలకు భోజన విందు నిర్వహించారు. ముందుగా సత్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి వారిని స్మరించుకున్నారు. అనంతరం చిన్నారులకు స్వయంగా వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ప్రతి ఏడాది ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకుడు నాయుడు.. మల్లేష్ కుటుంబం సేవాభావాన్ని కొనియాడారు.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్‌లు తక్షణమే ఇవ్వాలి

**దళిత వర్గాల ప్రయోజనాలు ఇతర వర్గాలు పొందకుండా చూడాలి**

**దళిత ఉద్యోగులకు అన్యాయం జరుగకుండా దేవస్థాన అధికారులు దేవాదాయ అధికారులు చూడాలి**

**ప్రమోషన్ లు అర్హులకు ఇవ్వకుంటే ఎమ్మార్పియస్ ప్రత్యక్ష ఉద్యమ కార్యాచారణకు పిలుపునిస్తాము**

**ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ**



యాదగిరిగుట్ట, మార్చి 31 (పోలీస్ నిఘా) : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో నెలకొన్న ప్రాముఖ్యత గల దేవస్థానం అయిన శ్రీలక్ష్మీ నర్సింహ్మా స్వామి వారి దేవస్థానం లో గత కొన్ని నెలలుగా దళిత వర్గాల ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు ఇవ్వడం లేదని ఇతర సామాజిక వర్గాల కు సంబంధించిన ప్రమోషన్ల ఆర్డర్ లు మాత్రం ఇస్తున్నారని కొందరు బీసీ కేటగిరి క్రింద ఉద్యోగం లో చేరి నేడు ఎస్సీ కేటగిరి క్రింద ప్రయోజనం పొందడం కోసం అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నా సమాచారం మా దృష్టికి వచ్చిందని ఈ అంశాల పై సమగ్ర విచారణ జరిపి నిజమైన అర్హతగల దళిత వర్గాల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించాలని కోరుతు యాదగిరిగుట్ట దేవస్థానం ఆలయ ఈవో భవాని శంకర్ ఆలయ చైర్మన్ నరసింహ్మా మూర్తి దళిత సంఘాల ప్రతినిధులు కలసి విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం లో దళిత వర్గాల ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని కొందరు బీసీ ఉద్యోగుల క్రింద ఉద్యోగం లో చేరి ఎస్సీ కోట క్రింద ప్రయోజనాలు పొందే విధంగా మోసపూరిత విధానాలకు పాల్పడుతున్నారని మా దృష్టికి వచ్చిందని తక్షణమే ఈ అంశాలపై ఉన్నత అధికారులు సమగ్ర విచారణ చేసి దళితవర్గ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. లేని పక్షంలో ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఈ అంశాలు తీసుకువెళ్లి న్యాయం చేసేదాకా ప్రత్యక్ష ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, జిల్లా నాయకులు బూడిద జానీ మాదిగ, మండల అధ్యక్షులు ఆకారపు లక్ష్మీ నారాయణ మాదిగ, పట్టణ అధ్యక్షులు బూడిద సింహాద్రి మాదిగ, పట్టణ ప్రధాన కార్యదర్శి గోపి నాగరాజు మాదిగ,సీనియర్ నాయకులు నేరేడు బాబు మాదిగ, రాంచంద్రం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# దేశరక్షణలో తొలి అడుగు ఎన్‌సిసి




యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు , మార్చి 31 (పోలీస్ నిఘా) : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు దేశభక్తిని అలవర చుకుని దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని, దేశ రక్షణలో తొలి అడుగు ఎన్ సి సి నే అని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల, ఎన్ సి సి అధికారి దూడల వెంకటేష్ అన్నారు. ఆలేరులో జడ్పిహెచ్ఎస్ బాలు ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 2026 -27 సంవత్సరానికి గాను మంగళవారం పదో ఎన్సీసీ వరంగల్ బెటాలియన్ ఆధ్వర్యంలో ఆర్మీ వింగ్ కి సంబంధించిన ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, జాతీయ సమైక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించి ఉత్తమ లక్షణాలు గలయువతను తయారు చేసేందుకు ఎన్ సి సి ఉపయోగపడుతుందని అన్నారు. ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగ పరచుకుంటే విద్యార్థుల భావి జీవితం బంగారు బాట అవుతుందని అన్నారు. ఎన్ సి సి క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఇంకా ఎన్నో విషయాలు అలవాడుతాయని అన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో ఏదైనా సాధిస్తాననే నమ్మకం పెరుగుతుందని అన్నారు. దేశం కోసం పని చేయాలన్న ఆలోచన కలుగుతుందని అన్నారు. ఈ శిక్షణ రెండు సంవత్సరాలు విద్యార్థులకు సైనిక విభాగానికి సంబంధించి డ్రిల్, పరేడ్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ అవేర్నెస్, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత, ఫీల్డ్ క్రాఫ్ట్ బాటిల్ క్రాఫ్ట్ మరియు శారీరక తదితర అంశాలలో ఉంటుందన్నారు. అంతేకాకుండా విద్య ఉద్యోగాలలో రిజర్వేషన్లు కూడా లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా 67 మంది విద్యార్థులకు వారి వారి శారీరక సామర్థ్యాన్ని పరీక్షించి, 49 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం లో పదవ తెలంగాణ ఎన్ సి సి బెటాలియన్ వరంగల్ అధికారులు ఇన్స్ట్రక్టర్ అజీమ్ అలీ, హావల్దార్ ఉద్ధవ్ తాన్ శెట్టి, ఉపాధ్యాయ బృందం, కాడెట్లు వినయ్ మనోజ్, సంజయ్, రిత్విక్, వరుణ్, రేచల్, భార్గవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం విజవంతం

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వెయ్యి కోట్ల రూపాయలు ఆదా**

**ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్**




దేవరకొండ , మార్చి 31 (పోలీస్ నిఘా) : ప్రజాపాలన ప్రగతి పథం అనే నినాదంతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి వెయ్యి కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా నేడు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ - దేవరకొండ వారి ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్. అనంతరం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వారం రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ, తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత దిశగా ఇది ఒక కీలకమైన అడుగు అని, ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా, వారి జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయని ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని అన్నారు. ఇకపై కూడా ప్రజల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందిన మహిళలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, ఆర్.ఏం (ఏం) నల్లగొండ భీంరెడ్డి, డీఎం విజయ కుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్

# పార్లమెంట్-2026 నిర్వహణ




హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్‌లో రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026ను నిర్వహించారు. తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 150 మంది పోటీదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "కేంద్ర బడ్జెట్ 2026: వికసిత్ భారత్-2047 దిశగా యువతకు మార్గాన్ని బలోపేతం చేయటం" ఇతివృత్తంపై పోటీదారులు చర్చించి.. అభిప్రాయాలను, విధానపరమైన సూచనలను పంచుకున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. విద్యాభ్యాసంతో పాటు నైపుణ్యాభివృద్ధి ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఉపాధి అవకాశాలు లేవని.. పరిస్థితులకు అనుగుణంగా మార్పు, ఆవిష్కరణ, పని నైపుణ్యంపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు శ్రీ అన్సుమన్ ప్రసాద్ దాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోటీదారులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్య ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. విజేతల ప్రకటనతో ఈ పోటీలు ముగిశాయి. ప్రథమ స్థానం- టి.నిఖిత, హైదరాబాద్; ద్వితీయ స్థానం- కె. అఖిల, ఖమ్మం; తృతీయ స్థానం- జె. ప్రగతి, జగిత్యాల.. విజేతలుగా నిలిచారు. వీళ్లు భారత పార్లమెంటులో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, మీడియా, కమ్యూనికేషన్ అధికారిణి శ్రీమతి వర్గంతి గాయత్రి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్ఎల్‌యూ) అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీ రాజారాం, సీనియర్ జర్నలిస్టు శ్రీ దిలీప్ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.ఎన్. జగన్ జ్యూరీ ప్యానెల్ సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యూత్ అధికారి శ్రీ టి. ఇసయ్య నిర్వహించారు. మై భారత్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశంలో ప్రమాదకర బైక్ స్టంట్స్ చేస్తున్న

# నలుగురు నిందితుల అరెస్ట్ మరియు రిమాండ్




హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తూ, ప్రమాదకరంగా బైక్ స్టంట్స్ చేస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

నిందితుల వివరాలు:

1.మొహమ్మద్ అమీర్ బాబా (ఏ-1): వయస్సు 21 సం॥, ఏసీ టెక్నీషియన్, నివాసం: బోరబండ.

2.మొహమ్మద్ అశ్వక్ (ఏ-2): వయస్సు 19 సం॥, బైక్ మెకానిక్, నివాసం: న్యూ హఫీజ్‌పేట్, మియాపూర్.

3.మొహమ్మద్ సమీరుద్దీన్ (ఏ-3): వయస్సు 26 సం॥, కార్ డ్రైవర్, నివాసం: బీఎస్ మఖ్తా, బేగంపేట్.

4.మొహమ్మద్ నాషిత్ అలియాస్ మొహమ్మద్ నశీర్ (ఏ-4): వయస్సు 20 సం॥, డెలివరీ బాయ్, నివాసం: బీఎస్ మఖ్తా, ఖైరతాబాద్.

ఘటన నేపథ్యం: ఈ నెల 27న అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ ఆదేశాల మేరకు పోలీస్ కానిస్టేబుల్ శ్రీమతి సి. సబిత (పీసీ 11360) మరియు హోంగార్డ్ అహ్మద్ పెట్రోలింగ్ విధుల్లో ఉండగా, రాత్రి 8 గంటల సమయంలో పిల్లర్ నంబర్ 143 నుండి ఆరాంఘర్ వైపు వెళ్లే మార్గంలో హోండా డియో (టీఎస్ 09 ఎఫ్ఎల్ 1262) వాహనంపై ఒక వ్యక్తి అత్యంత ప్రమాదకరంగా స్టంట్స్ చేస్తూ కనిపించాడు.

పోలీస్ సిబ్బంది సదరు వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, నిందితుడు నిర్లక్ష్యంగా, అతి వేగంగా వాహనాన్ని నడుపుతూ తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. బహిరంగ రహదారిపై ఇలాంటి చర్యలు ఇతర వాహనదారులకు, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయని తెలిసి కూడా నిందితుడు ఉద్దేశపూర్వకంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించాడు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ, మితిమీరిన వేగంతో వాహనం నడిపినందుకు గాను సదరు వ్యక్తులపై బిఎన్ఎస్ సెక్షన్లు 125, 281, 292 మరియు మోటార్ వాహనాల చట్టం సెక్షన్లు 183, 184, 190(2) కింద కేసు నమోదు (సీఆర్ నెం: 351/2026) చేయడం జరిగింది.

ప్రస్తుత పరిస్థితి: అరెస్ట్ చేసిన పై నిందితులను నేడు (31.03.2026) గౌరవనీయ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు వారికి జుడీషియల్ రిమాండ్ విధించింది.

పోలీసుల హెచ్చరిక: రోడ్లపై స్టంట్స్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఒకవేళ ఎవరైనా రౌడీషీటర్లు ఇటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నాము.

# ఎన్ ఫోర్స్మెంట్ విధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్**

**వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం**

**అక్రమ ఇసుక రవాణా గుట్కా విక్రయాలు, పేకాట, బెట్టింగ్ లను ఎన్ ఫోర్స్మెంట్ తో కట్టడి చేయాలి**

**గంజాయిను విక్రయాల మూలల పై నజర్**



వరంగల్, మార్చి 31 (పోలీస్ నిఘా) : కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా తో పాటు, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం, పేకాటను కట్టడి చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ ఫోర్స్మెంట్ ద్వారా నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాలో ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని,చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా ప్రజల భాగస్వామ్యంతో కాలనీలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారి గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన ఆరైవ్ - ఆలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వినూత్న రీతిలో అవగహన కార్యక్రమాలు చేపట్టాలని, రాబోవు హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలతో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్,రాజమహేంద్ర నాయక్,కవిత, జనగామ ఏ.ఎస్పీ చేతన్, ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, అదనపు డిసిపిలు ప్రభాకర్ , రవి,బాలస్వామి,శ్రీనివాస్ తో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గోన్నారు.

## పూలే దంపతుల విగ్రహాల నిర్మాణ పనుల పరిశీలన

**ఏప్రిల్ 11న సీఎం చేతుల మీదుగా ప్రారంభం**



యాదగిరిగుట్ట, మార్చి 31 (పోలీస్ నిఘా):హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఐమాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న లేక్ వ్యూ పార్క్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే,సావిత్రిబాయి పూలే విగ్రహాల పనులను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈ విగ్రహాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 11న అధికారికంగా ప్రారంభించనున్న నేపథ్యంలో పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండా సురేఖలతో కలిసి పనుల నాణ్యత, వేగం, ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల విగ్రహాలు సమాజానికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## మట్టివాసనలో మానవత్వం...

# మంజుల కవిత్వ గాథ



**బాల్యం :**

పల్లె పరిమళంలో పుట్టిన వ్యక్తిత్వం

మట్టివాసనలో మమకారం కలిసిన ఆ పల్లె గాలి...

అక్కడే మంజుల పత్తిపాటి అనే ఒక నున్నిత హృదయం రూపుదిద్దుకుంది.ఆలేరు పల్లె గాలిలో, మట్టి పరిమళంలో పెరిగిన ఆ చిన్నారి... పుస్తకాలతో పాటు జీవితాన్ని కూడా చదివింది.

రాధ–నర్సింహారావు దంపతులకు మూడవ సంతానంగా జన్మించిన ఆమెకు, తండ్రి ఉపాధ్యాయ వృత్తి కేవలం జీవనోపాధి కాదు..అది విలువల బాట.

1974లో ఆలేరు నేలపై పుట్టిన ఆ చిన్నారి, పుస్తకాల మధ్య మాత్రమే కాదు, ప్రకృతి ఒడిలో కూడా పెరిగింది. అల్లారుముద్దుగా పెరిగినా, ఆ పల్లె జీవితం ఆమెకు మానవత్వాన్ని నేర్పింది.

టైపింగ్ హయ్యర్, లోయర్ పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం...ఆమె పట్టుదలకి నిదర్శనం.

తన చిన్ననాటి జ్ఞాపకాలను "పల్లెటూరి జ్ఞాపకాలు"గా పదాల్లో నింపినప్పుడు..ఆమె హృదయం కవిత్వంగా పలికింది.

**వివాహం :**

బాధ్యతల బాటలో బలమైన అడుగులు

చిన్న వయస్సులోనే వివాహం...

జీవితం ఒక్కసారిగా బాల్యాన్ని వెనక్కి నెట్టేసి బాధ్యతల వైపు నడిపింది.

బావి నీళ్ళ బరువు కేవలం భుజాలపై కాదు..జీవితంపై పడింది.

బిందెలు మోసిన చేతులు, కట్టెల పొయ్యిపై వండిన వేళ్లు–కష్టాల్ని కరిగించి బలంగా మారాయి తర్వాత కలం పట్టి సమాజాన్ని మేల్కొలిపాయి.

ప్రతి కష్టం ఆమెను కూల్చలేదు...మరింత గట్టి చేసింది. ఆ కష్టాల్లో ఆమె చిరునవ్వు చచ్చిపోలేదు...

అదే ఆమె అంతర్ముఖ బలానికి నిదర్శనం.

ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేసి, తరువాత ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తూ...

ఒక మహిళగా, ఒక తల్లిగా, ఒక వ్యక్తిగా తన పాత్రలను సమర్థంగా నెరవేర్చింది.

**రాజకీయ ప్రస్థానం:**

ప్రజల మధ్య పుట్టిన నాయకత్వం

స్వార్థం లేని సేవాభావం–అదే ఆమెకు అసలైన గుర్తింపు.స్వల్ప వేతనంలోనూ అవసరమైన వారికి చేయూతనిచ్చిన ఆ మనసు, రాజకీయాలకు మార్గం చూపింది.అందరిలో కలసి పోయే, అందరి కష్టాల్లో పాలుపంచుకునే తత్వాన్ని గ్రహించిన వారి జీవిత భాగస్వామి మంజుల పత్తిపాటిని తొలిసారిగా రాజకీయ– రంగప్రవేశం చేయించారు. మండల కేంద్రంలోని మన్నెవారి తుర్కపల్లి నుండి బి ఆర్ ఎస్ పార్టీ తరుపున 2018 లో ఎంపీటీసీ గా పోటీ చేసి రెండు ఓట్ల తేడాతో ఓడినా..ఆమె సంకల్పం మాత్రం ఓడిపోలేదు. బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ప్రజల సమస్యలను తనవిగా భావించింది. రైతుల కష్టాలపై స్పందిస్తూ, రైతు సమస్యలపై గళమెత్తుతూ మార్కెట్ వ్యవసాయ కమిటీలో సేవలు అందించారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచుతు లారీల కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. రైతులకు సేవ చేస్తూ కరోన సమయంలో నిత్యావసర సరుకులు ప్రజలకు అందించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆమె నాయకత్వం కేవలం పదవి కాదు, బాధ్యతగా మార్చుకొన్నది. సామాజిక సేవ చేస్తూ వారి కష్టాలను ప్రత్యక్షంగా చూసిన తర్వాత సాహిత్య రచనల పట్ల ఆమె ఆసక్తి కనపరచినారు. అందుకు ఇంకో కారణం ఆమె పడిన కష్టాలు కూడా. రాజకీయ ప్రయాణంలో ఊరు ఊరు తిరుగుతున్నఅప్పుడు ప్రత్యక్షంగా ప్రజల సాధక బాధలు తెలుసుకొని స్పందించి అధికారులకు తెలియచేసి సమస్య పరిష్కారం చేసేది

**అక్షరయాత్ర:**

హృదయం పలికిన కవిత్వం

జీవితాన్ని దగ్గరగా చూసిన కళ్లకు...

బాధను అనుభవించిన హృదయానికి...

కవిత్వం ఒక సహజ స్పందన.

మంజుల గారి కలం–కేవలం అక్షరాలు కాదు, అనుభవాల ప్రవాహం. ఆమె జీవితానుభవాలే ఆమె కలానికి మసి అయ్యాయి. మూడు వందలకు పైన కవితలు రాసింది. రైతుల కష్టం, మహిళల వేదన, బాల్యపు జ్ఞాపకాలు, ప్రకృతి పరిరక్షణ...

ప్రతి అంశం ఆమె కవితల్లో జీవిస్తుంది.

రైతుల కష్టాలు, మహిళల అగచాట్లు,బాలకార్మిక వ్యవస్థ గురించి, పండుగలకు పకృతికి గల సంబంధాలు, పర్యావరణ పరిరక్షణ గురించి, బాల్య స్మృతులు, ఓటు హక్కు విలువ,

కళాకారుల కష్టాలు, స్త్రీ హృదయం, సాంఘిక అంశాలపై మరియు కళాకారులు దేవుని రూపాలు, అమ్మ హృదయం, శ్రీ సీతారామ దివ్య చరితం, చివరి దుప్పటి వంటి వంటి రచనలు...

ఆమె అంతరంగ గాథలకు ప్రతిబింబాలు.

పత్రికలు, ఆన్‌లైన్ వేదికలు–అన్నింటిలో ఆమె కవిత్వం పాఠకుల హృదయాలను తాకుతోంది.

**ముగింపు:**

మట్టిలో మొలిచిన మానవత్వం, పద్యంగా వికసించింది

మట్టిలో పుట్టి...

కష్టాల్లో కరిగి...

సేవలో వెలిగిన ఒక జీవితం–మంజుల పత్తిపాటి.

ఆమె కలం కేవలం రాయదు...

మనసులను మేల్కొలుపుతుంది.

బాధను పలుకుతుంది.

ప్రకృతిని కాపాడమని పిలుస్తుంది.

మట్టివాసనలో మొలిచిన ఆ మానవత్వం...

ఈరోజు కవిత్వంగా వికసించి,

సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోంది.

## మహిళలకు ఎంతో ప్రయోజనం

# మహాలక్ష్మి పథకం

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, మార్చి 31 (పోలీస్ నిఘా) : రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం డిసెంబర్ 9, 2023 నుండి విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా మహిళలు విస్తృతంగా ప్రయాణాలు చేసి ఇప్పటివరకు సుమారు 290 కోట్ల ప్రయాణాలు చేసి దాదాపు ?10,000 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి పదివేల కోట్ల రూపాయల మేర ఆదా చేరుకోవడం పై హనుమకొండ బస్ స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచితంగా ప్రయాణించేందుకు తోడ్పడుతుందని అన్నారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకొని ఆర్థికంగా లాభపడుతున్నారని తెలిపారు. ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోందని, అన్ని వర్గాల మహిళలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిత్యం బస్సుల్లో ప్రయాణించే పలువురు మహిళా ప్రయాణికులను ఆర్టీసీ అధికారులు శాలువాలు, బహుమతులతో సత్కరించారు. వారిలో మల్లికుదుర్ల నుండి హనుమకొండకు ఉన్నత విద్య కోసం ప్రయాణించే విద్యార్థిని బి కావ్య, స్వీపర్‌గా పనిచేస్తూ ప్రయాణించే పి భాగ్య, వ్యవసాయ పనుల నిమిత్తం ప్రయాణించే ఎస్ హైమావతి, స్వయం సహాయక సంఘ సభ్యురాలు రంజనా, ఖమ్మం నుండి వైద్య సేవల కోసం నిత్యం ప్రయాణించే జి రుక్మిణి గారిని సన్మానించారు.


ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, వరంగల్ వన్ డిపో మేనేజర్ పుప్పాల అర్పిత గారు, సూపర్వైజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# అ ఇంట్లో అందరి పేరు ముందు డాక్టర్ బిరుదు

**అంగోత్ తారాసింగ్‌కు డాక్టరేట్–ఓ యూ ప్రకటన**

**అందరు ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగులే**

**యువత కు ఆదర్శం గా నిలుస్తున్న గిరిజన కుటుంబం**






చెన్నారావుపేట, మార్చి 31 (పోలీస్ నిఘా) : చెన్నారావుపేట మండ లంలోని బోజెర్వు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జగ్గుతండ కుచెంది న అంగోత్ తారా సింగ్‌కు ఎలక్ట్రిక్ /విద్యత్ విభాగంలో "సోలార్ ద్వారా రేడియల్ డిస్ట్రి బ్యూషన్ సిస్టమ్‌లో యాక్టివ్ రియాక్టివ్ పవర్స్ నియంత్రణ" అనే అంశం పై చేసిన పరి శోధనకుహైదరాబాద్ ఉస్మానియా యూని వర్సిటీ వారు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు కుటుంబ నేపథ్యం తారాసింగ్ కుటుంబ నేపథ్యం అంగోత్ మల్కమ్మ–చీమ నాయక్ దంపతులకు నలుగురు కొడుకులు అందులో రెండో సంతా నంగా పుట్టిన తారాసిం గ్ చిన్న తనం నుండి చదువులో చురుకుగా ఉండేవాడు పాపయ్య పేట్ గ్రామంలో ప్రాథమి క విద్యా పూర్తి చేశాడు. గిరిజన గురుకుల పాఠ శాల అశోక్ నగర్ లో 10 వ,తరగతి పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల హిందూపురం లో ఇంట ర్మీడియట్ అనంతరం ఉస్మానియా యూనివ ర్సిటీలో నీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ శాఖ లో బ్యాచిలర్ మరియు మాస్టర్ డిగ్రీలు పూర్తి చేసి ప్రస్తుతం పాలిటెక్నిక్ కళాశాల కొత్తగూడెం లో ఎలక్ట్రిక్ విభాగం అధిపతి హెచ్ ఓ డి గా విధులు నిర్వ హిస్తున్నాడు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే చదు వు మీద మక్కువతో పి హెచ్ డి .లో సీటు సాధించి నిరంతరం కష్ట పడి పి హెచ్ డి . పట్టా పొందడం విశేషం మారు మూల గిరిజన ప్రాంతా ల్లో పుట్టి చదువు వాసన తెలియని జాతిలో ఉన్న త స్థాయికి ఎదిగిన వీరి కుటుంబం యువత కు ఆదర్శం. నలుగురు అన్నదమ్ములు విద్య బోధన రంగంలో ఉండ డంయాదృచ్ఛికంపెద్ద అన్న అంగోత్ భద్ర య్య,స్కూల్ అసిస్టెంట్ టీచర్ గా,తమ్ముడు డాక్టర్ అంగోత్ మోహన్,వైద్య కళాశాల ప్రొఫె సర్ గా,మరో డాక్టర్ తమ్ముడు అంగోత్ విజేందర్ ,ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు,వీరి కుమారులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ఉన్నత స్థాయిలో స్థిరపడడం మరో విశేషం.తమ్ముడు అంగోత్ విజేం దర్ , కంప్యూటర్ సైన్స్ ఇంజ నీరింగ్ లో డాక్టరే ట్ పొందడం, ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ లో తారా సింగ్,డాక్టరేట్ గా ఒకే ఇంట్లో ఇద్దరు డాక్టరేట్‌లు సాధించడం తో వారి కుటుంబం బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గిరిజన సంఘం నాయకులు,ఇతర పెద్దలు తారా సింగ్ ను అభినందించారు .

# మానవత్వానికి మారుపేరు యలమందల జగదీష్


### ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు పంపిణీ





ఖమ్మం, మార్చి 31 (పోలీస్ నిఘా) : ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు పంపిణీ చేసి మానవత్వానికి మారుపేరుగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నిలిచారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం, 1వ డివిజన్ లో మంగళవారం బోడ నాగేశ్వరరావు (చిన్న), బోడ ఉమ అనారోగ్యంతో మరణించి అనాదలుగా మిగిలిన ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి, అదేవిధంగా కొడుకు చనిపోయి అనారోగ్యంతో ఒంటరి జీవితం గడుపుతున్న బొమ్మకంటి బూబమ్మ కుంటుంబానికి, ఇరువురి కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, 25కేజీల బియ్యం, కొంత ధన రూపంలో ఆర్థికసాయం అందించి జగదీష్ మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. పేదవారికి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుర్రం వెంకట్రామయ్య, తుళ్లూరు ప్రసాద్, గుర్రం కృష్ణయ్య, తేజావత్ వీరన్న, గద్దల నాగేశ్వరరావు, తేజావత్ సంఘం, జక్కంపూడి సతీష్, తుళ్లూరు మధు, జగదీష్ యువసైన్యం మంచాల నాగ, తోట సతీష్, ఆంగోతు కిషోర్, కంచర్ల శేఖర్, పందుల కార్తిక్, ఉప్పెర్ల ఉదయ్, కొండా రాకేష్, బొమ్మకంటి జగదీష్, లింగనబోయిన నవదీప్, మంచాల రాజు, లింగనబోయిన హేమంత్, మల్లు భరత్, రాగం పండు, వనపర్తి ఉదయ్, తేజావత్ బాలకృష్ణ, కుమ్మరకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్స్ ఇచ్చే సెంటర్ను రహదారి బంగ్లాలో ఏర్పాటు చేయడం కోసం వినతిపత్రం అందచేసిన కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు, మార్చి 31 (పోలీస్ నిఘా) : పెన్షన్స్ కోసం పోస్ట్ ఆఫీస్ కి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, మహిళలు,వికలాంగుల కోసం ఒకటవ వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ మంగళవారం రోజునా ఆలేరు తహసిల్దార్ కి మరియు మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో వృద్ధులు,వికలాంగులు పోస్ట్ ఆఫీస్ కి వెళ్లడానికి రవాణా సౌకర్యాలు సరిగా లేవని అలాగే అండర్పాస్ పనులు కూడా పూర్తి కాకపోవడంతో వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని, ఒకవేళ రైల్వే స్టేషన్ నుంచి వెళ్దామంటే కోతుల బెడద చాలా ఉందని తెలియజేశారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన కమిషనర్ మరియు తహసిల్దార్ పోస్ట్ ఆఫీస్ కి ఫోన్ చేసి మరొక సెంటర్ ని ఒకటో వార్డులోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు పోస్ట్ ఆఫీస్ వారు సనుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరితగతిన స్పందించిన కమిషనర్ మరియు తహసిల్దార్ కి కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ ధన్యవాదాలు తెలియజేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

**-వినతి పత్రం అందించిన మధ్యాహ్న భోజన కార్మికులు-**




మధిర, మార్చి 31 (పోలీస్ నిఘా) : మధ్యాహ్న భోజన కార్మికులకు ఫిక్స్డ్ వేతనం 10000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మధిర మండలం మధ్యాహ్న భోజన కార్మికులు సిఐటి ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఫిక్స్డ్ వేతనం 10000 ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు, స్కూలుకు మౌలిక వసతులు కల్పించాలని, గ్యాస్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా ఇవ్వాలని, వంట కు అవసరమైన సరుకులను ప్రభుత్వమే అందించాలని, వంట మనిషికి కాటన్ చీరలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు పడకండి మురళి, మధ్యాహ్న భోజన కార్మికులు గౌర్రాజు ధనలక్ష్మి, చిన్ని, పర్జానా బేగం, సోమ అరులమ్మ, కనకదుర్గ, తిరుపతమ్మ, పద్మ, కృష్ణారెడ్డి, భారతి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ముమ్మరంగా కొనసాగుతున్న భట్టి విక్రమార్క తనయుడి వివాహ రిసెప్షన్ ఏర్పాట్లు





మధిర, మార్చి 31 (పోలీస్ నిఘా) : ఖమ్మం పట్టణం వైయస్సార్ నగర్ సమీపాన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఆర్థిక ప్రణాళిక మరియు విద్యుత్ శాఖ మంత్రివర్యులు గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్క నందిని విక్రమార్క దంపతుల తనయుడు సూర్య విక్రమాదిత్య సాక్షి ల వివాహనంతర ఏర్పాటు చేయబడిన రిసెప్షన్ కార్యక్రమం ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న రిసెప్షన్ కార్యక్రమం. అట్టి ఏర్పాట్లను మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్. జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ లు పాల్గొని పరిశీలించారు.

## చందంపేటను అసెంబ్లీ కేంద్రంగా ఏర్పాటు చేయాలి: బోడ శ్రీశైలం యాదవ్



దేవరకొండ, మార్చి 31 (పోలీస్ నిఘా) : చందంపేట 2027 డిలిమిటేషన్లో భాగంగా చందంపేట మండలంలోని తెలదేవరపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తూ దానితోపాటుగా సిద్ధాపూర్ మండలాన్ని, డిండి మండలాన్ని, చెరుకుపల్లి మండలాన్ని, నేరడు కొమ్ము మండలాన్ని కలుపుతూ చందంపేటను నూతన అసెంబ్లీగా ఏర్పాటు చేయాలని,అదే విధంగా దేవరకొండ కేంద్రంగా లోకసభ స్థానంగా ఏర్పాటు చేయాలని చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.


## స్వామివారి సేవలో బిఆర్ఎస్ మహిళా నేతలు

**- సీఎం రేవంత్ రెడ్డికి సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థనలు-**



యాదగిరిగుట్ట, మార్చి 31 (పోలీస్ నిఘా) : యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని క్షమించి ఆయనకు సద్బుద్ధి ప్రసాదించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను కాపాడాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. గిరిప్రదక్షిణలో పాల్గొని అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమతో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని అభివృద్ధి చేయాలి: ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



ఖమ్మం, మార్చి 31 : నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని అభివృద్ధి చేసి జాతీయ బౌద్ధ పర్యాటక సర్క్యూట్ లో చేర్చాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ ప్రాచీన కట్టడాన్ని సంరక్షించేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. సోమవారం లోక్‌సభలో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం దక్షిణ భారతదేశంలో కీలక బౌద్ధ వారసత్వ క్షేత్రమని చెప్పారు. శాతవాహన, ఇక్ష్వాకు కాలానికి చెందిన ఈ కట్టడం చారిత్రక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. తవ్వకాలలో మహాస్తూపాలు, విహారాలు, ఇటుక నిర్మాణాలు, బుద్ధ విగ్రహాలు, నాణేలు బయటపడటం దీని గొప్పతనాన్ని తెలియజేస్తుందని వివరించారు.

**సదుపాయాల కల్పనపై సూచనలు చేసిన ఎంపి**

ఈ స్థలం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రహదారులు, సూచిక బోర్డులు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలు లేవని పేర్కొన్నారు. నిర్మాణాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమగ్ర సంరక్షణ చేపట్టాలని సూచించారు. మ్యూజియం, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. నేలకొండపల్లిని జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో చేర్చితే దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించవచ్చని అన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణలో సాంస్కృతిక పర్యాటక అభివృద్ధికి కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలని రామసహాయం రఘురాం రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సొంత ఇంటి కల నెరవేర్చిన యువ కౌన్సిలర్ ఎస్పి శివ

**నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ**

**26వ వార్డులో 3 ముగ్గురికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ , మార్చి 31 (పోలీస్ నిఘా) : పేద ప్రజలు ఎంతో కొలంగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి కల ఈరోజుతో తీరిపోయిందని తన వార్డులో 3 ముగ్గురికి మంగళవారం రోజున డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసినట్లు కౌన్సిలర్ ఎస్పీ శివ తెలిపారు. నిరుపేదలకు ఇళ్లను పంపిణీ చేసినట్లు ఎస్పి శివ పేర్కొన్నారు. ఈరోజు 3 ముగ్గురికి ఇళ్లకు సంబంధించిన పట్టాలను అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల వివరాలను ఎస్పీ శివ మీడియాకు విడుదల చేశారు. ఎనుముల మల్లిక,గంగిశెట్టి పార్వతమ్మ, మినుగుల అభిలాష్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసినట్లు తెలిపారు. డబల్ బెడ్ రూమ్ తీసుకున్న వారు మాట్లాడుతూ,, ఎంతోకాలంగా సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని చూస్తున్నామని తెలిపారు. ఈరోజు మాకు డబల్ బెడ్లు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## కోర్ర తండా ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక అవస్థలు

**జనసేన పార్టీ సినియర్ నాయకులు**

**కోర్ర చందు నాయక్ కు కోర్ర తండా గ్రామ ప్రజలు విజ్ఞప్తి**



దేవరకొండ, మార్చి 31 (పోలీస్ నిఘా) : దేవరకొండ పట్టణం కోర్ర తండా గ్రామపంచాయతీ ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లు రాక అవస్థలు పడుతున్న కొర్ర తండ ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు నెల కిందట పైపులు పగిలిపోయాయని చెప్పడం జరిగి ంది గ్రామ సర్పంచి మాట కూడా వినని అధికారులు ఈ విషయం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్ తెలియజేయగానే స్పందించి వెంటనే ఎంపీడీవోకు ఫిర్యాదు ఇవ్వగా మిషన్ భగీరథ నీళ్లు అతి త్వరలో అందిస్తామని చెప్పడం జరిగింది కానీ ఇప్పటికి వారం గడిచిన మిషన్ భగీరథ నీళ్లు అందక అవస్థలు పడుతున్న ప్రజలు వెంటనే అధికారులు ఈ విషయంపై స్పందించి సమస్యని పరిష్కరించకపోతే గ్రామ ప్రజలు వందల మందితో బిందెలు తీసుకొచ్చి రోడ్డుపైన ధర్నా నిరసన నిర్వహించాల్సి వస్తుందని అధికారులకు చందు నాయక్ హెచ్చరించారు.

# చిత్రం

## ఒకేసారి మూడు పాన్ ఇండియా చిత్రాలతో డార్లింగ్ రికార్డు!



ఏడాదికి ఒక సినిమా రిలీజ్ చేయడానికి స్టార్ హీరోలంతా కిందా మీదా పడుతున్నారు. అందులోనూ ఏక కాలంలో రెండు సినిమా షూటింగ్‌లకు హాజరవ్వడం అంటే హీరోల వ్యధలు ఇంకే స్థాయిలో ఉంటాయో చెప్పాల్సిన పని లేదు. అలాగని హీరోలందరి విషయంలో ఇది వర్తించదు. కొంత మంది హీరోలు షూటింగ్ ను అంతే వేగంగా పూర్తి చేయగల సమర్థులున్నారు. అయితే ఇక్కడ హీరోల కోణంలోనే చూడాల్సిన పనిలేదు. డైరెక్టర్ కూడా అంతే కీలకం. డెరెక్టర్ ఇచ్చే డైరెక్షన్‌ని బట్టే షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది? సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్నది క్లారిటీ ఉంటుంది. ఈ విషయంలో చాలా మంది స్టార్ హీరోలందరికంటే డార్లింగ్ ప్రభాస్ ఎంతో మెరుగ్గా పనిచేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడిప్పుడే కొంత మంది స్టార్లు ప్రభాస్ ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు కదులుతున్నారు. తాజాగా డార్లింగ్ మరోసారి ఏక కాలంలో మూడు సినిమా షూటింగ్ లు పూర్తిచేస్తూ షెభాష్ అనిపిస్తున్నాడు. ప్రస్తుతం ప్రభాస్ ఏకకాలంలో 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బడ్జెట్ పాన్-ఇండియా చిత్రాల షూటింగ్‌లలో పాల్గొంటూ రికార్డు సృష్టిస్తున్నారు. ఒకే సమయంలో మూడు భిన్నమైన ప్రపంచాలు, మూడు భిన్నమైన పాత్రలను హ్యాండిల్ చేయడం చిన్న విషయం కాదు. కానీ ప్రభాస్ తన అంకిత భావంతో సాధ్యం చేస్తున్నారు. రెండు..మూడు నెలలుగా 'ఫౌజీ', స్పిరిట్' షూటింగ్ ల్లో నిర్విరామంగా డార్లింగ్ పాల్గొంటున్న సంగతి తెలిసిందే. 'కల్కి 2' షూటింగ్ కూడా మొదలవ్వడంతో? ఆ సినిమా షూట్ కు వెళ్లడానికి రెడీ అవుతున్నాడు. ఇప్పటి వరకూ ప్రభాస్ లేని సన్నివేశాలను దర్శకుడు నాగీ చిత్రీకరించారు. కానీ ఇకపై డార్లింగ్ కూడా రెగ్యులర్ గా షూట్ కి హాజరు కావాల్సి సమయం ఆసన్నమైంది. దీంతో ప్రభాస్ షెడ్యూల్ మరింత టైట్ అవుతుందని తెలుస్తోంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో మరింత బిజీ అవుతారు. ఒక్కో సినిమాకు ఒక్కో రకమైన లుక్, బాడీ లాంగ్వేజ్ అవసరమవుతాయి. ఏ ఒక్క ప్రాజెక్టుకు ఇబ్బంది కలగకుండా ప్రభాస్ ముందుకెళ్లాల్సి ఉంటుంది. ప్రభాస్ లో కమిట్ మెంట్ చూస్తుంటే... వృత్తి పట్ల ఆయన గౌరవాన్ని తెలియ జేస్తోంది. గతంలో కూడా డార్లింగ్ 'సలార్', 'కల్కి2898', 'ఆదిపురుష్' వంటి చిత్రాలను ఒకే సమయంలో బ్యాలెన్స్ చేశారు. అప్పుడు చేతిలో సమయం ఉండటంతో పెద్దగా ఇబ్బంది పడలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. నాలిగింతలు అధికంగా శ్రమించాల్సి ఉంటుంది. నటుడిగా పాత్రల మధ్య తేడాను చూపిస్తూ, వేర్వేరు దర్శకుల విజన్‌కు అనుగుణంగా మారి పనిచేయాల్సి ఉంటుంది. ఇలా ఒకేసారి మూడు సినిమాలు పట్టాలెక్కించిన డార్లింగ్ ను నిజంగా మెచ్చుకోవాల్సిందే. ప్రభాస్ తో పోల్చితే షూట్ విషయంలో మిగతా పాన్ ఇండియా స్టార్లు ఎంతగా వెనుక బడుతున్నారు అన్నది అద్దం పడుతుంది.

## వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంట్రీ



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా తన ప్రయాణాన్ని మరింత విస్తరించుకుంటూ డైరెక్టర్ వంశీ పైడిపల్లి ఇప్పుడు ఒక కీలక మైలురాయిని చేరుకున్నారు. వరిసు సక్సెస్ తర్వాత ఆయన కెరీర్‌లో ఇది స్పష్టమైన టర్నింగ్ పాయింట్‌గా భావిస్తున్నారు. టాలీవుడ్ డైరెక్టర్లు బాలీవుడ్ వైపు అడుగులు వేస్తున్న ఈ ట్రెండ్‌లో వంశీ ఎంట్రీ మరింత స్పెషల్‌గా నిలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటించడం సినిమాకు మరింత స్థాయిని తీసుకొచ్చింది. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, బాలీవుడ్– టాలీవుడ్ కలయికగా రూపొందుతున్న పాన్ ఇండియా ప్రయత్నం. మల్టీ లాంగ్వేజ్ రిలీజ్‌తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను టార్గెట్ చేస్తూ, ఈ సినిమా కమర్షియల్ స్కేల్ పరంగా భారీ బ్లాస్ట్‌కు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇండియన్ సినిమా మార్కెట్‌లో పాన్–ఇండియా ట్రెండ్ ఎంత కీలకమో తెలిసిందే, ఈ ప్రాజెక్ట్ కూడా అదే దిశగా ముందుకు సాగుతోంది. ప్రొడక్షన్ విషయానికొస్తే, ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించడం మరో మెయిన్ ఎట్రాక్షన్. భారీ బడ్జెట్ సినిమాలను సక్సెస్‌ఫుల్ గా మౌంట్ చేసిన ట్రాక్ రికార్డ్ ఆయనకు ఉంది. కంటెంట్‌తో పాటు ప్రొడక్షన్ వాల్యూస్‌కి ప్రాధాన్యం ఇచ్చే ఆయన స్టైల్ ఈ సినిమాకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ కాంబినేషన్ వల్లే ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి, డిల్ రాజు.. ఈ ముగ్గురూ కలిసి మొదటిసారి పనిచేయడం ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతోంది. స్టార్ పవర్, డైరెక్టర్ విజన్, ప్రొడ్యూసర్ ప్లానింగ్ వీటన్నింటితో ఈ సినిమా రూపుది ద్దుకుంటోంది. ఇలాంటి కాంబినేషన్లు సాధారణంగా ఇండస్ట్రీలో హైప్ క్రియేట్ చేస్తాయి, అదే పరిస్థితి ఇప్పుడు కూడా కనిపిస్తోంది. స్టోరీ పరంగా చూస్తే, వంశీ పైడిపల్లి తన ప్రత్యేకత అయిన యాక్షన్ ఎమోషన్ మిశ్రమాన్ని ఈ సినిమాలో కూడా కొనసాగించనున్నట్లు సమాచారం. స్క్రిప్ట్ వినగానే సల్మాన్ ఖాన్ వెంటనే ఓకే చెప్పారనే వార్త ఈ కథలో ఉన్న బలమేంటో చెప్పేస్తోంది. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషనల్ డెప్త్ కలిపిన నేరేటివ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఇక ఫ్యాన్స్ విషయానికి వస్తే, ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ ప్రాజెక్ట్‌పై చర్చ మొదలైంది. సల్మాన్ ఫ్యాన్స్‌తో పాటూ తెలుగు ప్రేక్షకులు కూడా ఈ కాంబినేషన్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ సినిమా మరింత ట్రెండ్ అయ్యే సూచనలుగా కనిపిస్తోంది. మొత్తంగా, ఈ ప్రాజెక్ట్ ఒక సాధారణ సినిమా కాకుండా, ఇండియన్ సినిమా మార్కెట్‌ను టార్గెట్ చేసిన భారీ వ్యూహాత్మక ప్రయత్నంగా మారుతోంది. సరైన ఎగ్జిక్యూషన్ ఉంటే, ఇది బాక్సాఫీస్ వద్ద కూడా పెద్ద ప్రభావం చూపే అవకా శాలున్నాయి.

## రూటు మారుస్తున్న 'జాతిరత్నాలు' దర్శకుడు



కొవిడ్ టైంలో తీవ్ర ఒత్తిడిలో ఉన్న తెలుగు వాళ్లకు ఉపశమనాన్ని ఇచ్చిన చిత్రాల్లో 'జాతిరత్నాలు' ఒకటి. ఆర్గానిక్ హ్యూమర్‌తో ఆ సినిమా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. తెలుగులో అప్పటిదాకా వచ్చిన కామెడీ చిత్రాల్లో అదో రకం. ఈ చిత్రంతో దర్శకుడు అనుదీప్ కేవీ పేరు మార్మోగింది. కేవలం తన సినిమాలతోనే కాకుండా.. ఇంటర్వ్యూలు, టీవీ ప్రోగ్రాంలతోనూ అతను కడుపుబ్బ నవ్వించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అనుదీప్‌ను చూడగానే జనాల ముఖాల్లో చిరునవ్వు వచ్చేంతగా అతను పాపులర్ అయ్యాడు. 'జాతిరత్నాలు' తర్వాత అతడి సినిమాల మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ తన ప్రొడక్షన్లో వచ్చిన 'ఫస్ట్ డే ఫస్ట్ షో'నే కాక.. అతను దర్శకత్వం వహించిన ప్రిన్స్, ఫంకీ చిత్రాలు ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురి చేశాయి. ఒకే తరహా కామెడీతో అతను త్వరగా ప్రేక్షకులకు మొహం మొత్తేలా చేశాడు. ముఖ్యంగా 'ఫంకీ' సినిమా అయితే అనుదీప్ కెరీర్‌నే డోలాయమానంలోకి నెట్టే స్థాయిలో డిజాస్టర్ అయింది. దీంతో ఇకపై అతనేం సినిమాలు తీస్తాడో.. తనకెవరు అవకాశాలు ఇస్తారో అనే ప్రశ్నలు తలెత్తాయి. ఐతే టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో అనుదీప్ తన నెక్స్ట్ మూవీ చేయబోతున్నాడట. ఈసారి అతను తన మార్కు కామెడీ సినిమా తీయబోవడం లేదట. పూర్తిగా రూటు మార్చి ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేయడానికి రెడీ అవుతన్నాడట అనుదీప్. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రకటించబోతున్నారు. మరి అనుదీప్ చిత్రంలో లీడ్ రోల్ చేసే హీరోయిన్ ఎవరో చూడాలి. అనుదీప్ కామెడీ మాత్రమే తీయగలడనే అభిప్రాయంతో ఉన్నారు ప్రేక్షకులు. ఆ మైండ్ సెట్‌ను మార్చడమే కాక.. వేరే జానర్ సినిమాతో మెప్పించి మళ్లీ ఓ హిట్టు కొట్టి బలంగా బౌన్స్ బ్యాక్ అవుతాడేమో చూడాలి అనుదీప్.

## సక్సెస్ అయితేనే కృతిశెట్టికి కలిసొచ్చేది!



కృతి శెట్టి టాలీవుడ్ ..కోలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందం, అభినయం, ట్యాలెంట్ ఉన్నా టాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో కోలీవుడ్ లో కూడా అదృష్టాన్నిపరీక్షించుకుంది. అక్కడా అదే పరిస్థితి. కాకపోతే తెలుగు కంటే తమిళ్ లో మెరుగ్గా కనిపిస్తోంది. సినిమా ఫ్లాప్ అయినా మరో ఛాన్స్ అందుకోగల్గుతుంది. అక్కడైనా ఇలా ఎంత కాలం.. దీంతో అమ్మడి కెరీర్ హిట్ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో కృతి శెట్టి ఆశలన్నీ తాజా చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' పైనే ఉన్నాయి. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకె క్కుతోన్న ఈ సినిమాపై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి అంచనాలు ఉన్నాయి. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి బజ్ ఏర్పడింది. లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా గెస్ట్ రోల్ పోషించడం సినిమాకు కీలకంగా మారింది. ప్రత్యేకించి కృతి శెట్టికి తమిళంలో పెద్ద బ్రేక్ ఇచ్చే సినిమా అవుతుందని ఎంతో ధీమాతో ఉంది. ఈ విషయంలో మేకర్స్ కూడా అంతే కాన్ఫిడెంట్ గా ఉన్నారు. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సూపర్ హిట్ అయితే కృతి గ్రాఫ్ మళ్లీ ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. సినిమా గనుక ఆశించిన స్థాయిలో ఆడకపోతే కృతి శెట్టి కెరీర్ మరిన్ని ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొత్త కథానాయికల నుంచి పోటీ పెరగడం, పాన్–ఇండియా సినిమాల ట్రెండ్ నడుస్తుండటంతో, పాత ఫామ్‌ను అందుకోవడం అమ్మడికి సవాలుగా మారింది. తమిళంలో విజయం సాధిస్తేనే తెలుగు మేకర్స్ ఆమె వైపు మళ్లీ చూసే పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే చిన్న సినిమాలకే పరిమితం కావాల్సి వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే కృతిశెట్టి మాత్రం తనలో స్కిల్స్ ను మెరుగు పరుచుకుంటుంది. కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటుంది. ఈ నేపథ్యంలో'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' విజయం ఓ టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆశిస్తుంది. తమిళ తంబీలు అమ్మడిని ఆదరిస్తే ఆ వేడి టాలీవుడ్‌కు తాకుతుందనడంలో సందేహం లేదు. చివరిగా ఈ సినిమా కృతి శెట్టికి మేక్ ఆర్ బ్రేక్ లాంటిదిగా చెప్పొచ్చు. సక్సెస్ అయితేనే ఆమెకు ఇండస్ట్రీలో మళ్లీ పూర్వ వైభవం వస్తుంది. మరి బేబమ్మ టైమ్ ఎలా ఉందో చూడాలి. అలాగే కోలీవుడ్ లో 'జెన్నీ' అనే మరో చిత్రంలోనూ నటిస్తోంది. కానీ ఈ సినిమా మొదలై నెలలు గడుస్తున్నా మళ్లీ ఎలాంటి అప్ డేట్ లేదు. సినిమా ఉందా? రద్దయిందా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## హిట్లు ఇచ్చినా అతడు ఇంకా అక్కడే!



త్రినాధరావు నక్కిన పరిచయం అవసరం లేని పేరు. 'సినిమా చూపిస్త మావ', 'నేను లోకల్', 'హలో గురు ప్రేమకోసమే, 'ధమాకా' వంటి విజయాలతో తనకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు, వినోదం , కమర్షియల్ హంగులను సమపాళ్లలో మిళితం చేయడంలో ఆయన దిట్ట. ఇలాంటి డైరెక్టర్లకు టాలీవుడ్ లో డిమాండ్ బాగానే ఉంటుంది. టాప్ డైరెక్టర్ల లిస్ట్ లోచేరడానికి పెద్దగా సమయం పట్టదు. కెరీర్ గ్రాఫ్ పరిశీలిస్తే ఫ్లాప్ కంటే హిట్లే ఎక్కువ ఉన్నాయి. కానీ కానీ త్రినాధరావు ఈ రెండు విభాగాల్లోనూ ఇంకా వెనుకబడే ఉన్నారు. స్టార్ హీరోలతో సినిమాలు చేయాలనే కోరిక, అగ్ర నిర్మాణ సంస్థల నుంచి పిలుపు అందుకోవాలనే ఆశ ప్రతి దర్శకుడికి ఉంటుంది. కానీ త్రినాధరావుకు మాత్రం అటువంటి పెద్ద ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో దక్కడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత టాలీవుడ్ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కొత్త తరం దర్శకులు వినూత్నమైన కాన్సెప్టులతో సరికొత్త కథనాలతో ప్రేక్షకులను ఆకట్టు కుంటున్నారు. ప్రేక్షకుల అభిరుచులు మారడంతో పాటు చిన్న దర్శకులు కూడా భారీ ప్లానింగ్‌తో సినిమాలు చేస్తూ అగ్ర దర్శకులకు గట్టి పోటీ ఇస్తున్నారు. మరి త్రినాధరావు ఎందుకు వెనుకబడుతున్నాడు? అగ్ర దర్శకులకు పోటీగా ఎందుకు వెళ్లలేకపోతున్నారంటే? పోటీ ప్రపంచంలో కేవలం కమర్షియల్ ఫార్ములా సినిమాలు మాత్రమే సరిపోవు. కథలో లోతు , వినూత్నత ఉండాలని ప్రేక్షకులు ఆశిస్తున్నారు. ఇది త్రినాధరావుకు కొంత ప్రతికూలంగా మారిందన్నది వాస్తవం. మరోవైపు తెలుగు సినిమాలు పాన్–ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టిస్తున్నాయి. 'బాహుబలి' , 'పుష్ప' లాంటి భారీ విజువల్స్ , గ్రాండ్ ఎమోషన్స్ ఉన్న సినిమాలకే ప్రేక్షకులు పట్టం కడుతున్నారు. ఈ క్రమంలో పాన్–ఇండియా స్థాయికి తగ్గ కథలను సిద్ధం చేసుకోవడంలో లేదా అటువంటి బడ్జెట్ సినిమాలను హ్యాండిల్ చేయడంలో త్రినాధరావు వెనుకబడిపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తన పాత ఫార్ములానే నమ్ముకోవడం వల్ల పెద్ద హీరోల దృష్టిని ఆకర్షించలే కపోతున్నారని వినిపిస్తోంది. ఎంటర్ టైన్ మెంట్ వరకూ త్రినాధరావు విషయంలో చూడాల్సిన పనిలేదు. కానీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరోలను మెప్పించాలంటే కేవలం వినోదం మాత్రమే సరిపోదు. దాంతో పాటు భారీ కథాంశం కూడా ఉండాలి. ఆ స్థాయి మేకింగ్ వైపు ఆయన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. త్రినాధరావు నక్కిన ప్రతిభకు ఎలాంటి కొదవ లేదు. ఒక దర్శకుడిగా తనను తాను మార్చు కుంటూ పాత ఫార్ములాను వదిలి సరికొత్త ప్రయోగాలకు సిద్ధమైతే తప్ప స్టార్ హీరోల సినిమాలు దక్కడం కష్టం అనే మాట బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం త్రినాధరావు 'నేను రెడీ' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే.

# డ్రగ్స్ టెస్ట్ తర్వాతే సినిమాల విడుదలకు అనుమతివ్వాలి

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) :జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో ఇప్పుప్పు సారాపై తాను మాట్లాడితే ట్రోలింగ్ చేశారని మండిపడ్డారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ట్రోలర్స్‌పై మండిపడ్డారు. రాజకీయ నాయకుడిగా తాను సారా గురించి మాట్లాడితే ట్రోల్స్ చేస్తున్నారు. ఇదే సారాను ఖుషీ సినిమాలో పవన్ కల్యాణ్ తాగుతున్నట్లు నటించారు. అప్పుడు జనాలు ఈలలు కేకలు వేశారు. అదేవిధంగా నందమూరి బాలకృష్ణ ఏకంగా 'మామ ఏక్ పెగ్ లా' అనే పాటకు డ్యాన్స్ చేసినా ఎంజాయ్ చేశారు. అదే మేము ప్రజల ఆరోగ్యం గురించి ఇప్పుప్పు ప్రస్తావన తీసుకొస్తే ట్రోల్స్ చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని అనిరుధ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై సినిమా యాక్టర్లంతా డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని సంచలన డిమాండ్ చేశారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకుంటేనే వారి సినిమాల విడుదలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోని యాక్టర్లు.. డ్రగ్స్ తీసుకున్నట్లే అని హాట్ కామెంట్స్ చేశారు. తాను ఎవర్నీ తప్పుబట్టడం లేదని.. అందరూ బాధ్యతగా ఉండాలని అనుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కూడా మద్యం తాగొద్దని భర్తలతో భార్యలు ఒట్టువేయించుకోవాలని కోరారు.

# ఇండిగో కొత్త సీఈవోగా విలియం వాల్ష్



న్యూఢిల్లీ, మార్చి 31 : భారతదేశంలో అతి పెద్ద ఎయిర్ లైన్ సంస్థ ఇండిగో చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ (సీఈవో)గా విలయం వాల్ష్ నియమితలయ్యారు. బ్రిటీషన్ ఎయిర్ వేస్ మాజీ చీఫ్‌గా పని చేసిన విలయం వార్ష్ తమ తదుపరి సీఈవోగా నియమించుకుంది. ఈయన ప్రస్తుతతం ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్ పోర్టు అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఇండిగో తాత్కాలిక సీఈవోగా ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా బాధ్యతలు నిర్వర్తించగా అంతకు ముందు ఈ పదవిలో పీటర్ ఎల్బర్స్ కొనసాగారు.

మాజీ సీఈవో చుట్టూ విమర్శలే: పీటర్ ఎల్బర్స్ సారథ్యంలో ఇండియా వరుస వైఫల్యాలతో తీవ్ర అప్రతిష్టను మూటగట్టుకుంది. గతేడాది ఈ పీటర్ ఎల్బర్స్ నేతృత్వంలో ఇండిగో సంస్థ ప్రయాణికులకు చుక్కలు చూపెట్టింది. వందలాది ఫ్లైట్లు రద్దు చేసి ప్రత్యక్ష నరకం చూపింది. ఈ పరిణామంతో ఆయనపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలోనే విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) విచారణ జరుపుతూ, చర్యలకు ఉపక్రించింది. నేపథ్యంలో ఆయన ఇండిగో సీఈవో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అయితే ఎల్బర్స్ తన రాజీనామా లేఖలో వ్యక్తిగత కారణాలను పేర్కొంటూ, తన నోటీసు కాలాన్ని మినహాయించాలని కోరారు. అయితే తన రాజీనామా నుంచి ఎండీ రాహుల్ భాటియా తాత్కాలికంగా సీఈఓ బాధ్యతలూ చేపట్టారు.

**ఇప్పుడైనానా మెరుగుపడేనా?:**

2005లో ప్రారంభమైన ఇండిగో ఆ మరుసటి ఏడాదిలోనే కార్యకలాపాలను మొదలు పెట్టింది. ప్రస్తుతం ఆ కంపెనీ వద్ద 434 విమానాలు ఉండగా ప్రపంచ వ్యాప్తంగా 128 నగరాలకు రోజూ 2,300 సర్వీసులను ఆ సంస్థ నడుపుతోంది. దేశీయ వైమానిక రంగ మార్కెట్ వాటాలో 63 శాతం ఇండిగోదే. అంటే ఈ రంగంలో ఇండిగోది స్పష్టమైన గుత్తాధిపత్యం కనిపిస్తోంది. ఈ పరిస్థితి సరికాదని నిపుణులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. అయితే కొత్త సీఈవో రాకతో సంస్థ సేవల్లో మెరుగుదల కనిపిస్తుందా లేక పాత సంప్రతాయాలతోనే ముందుకు వెళ్తుందా అనేది కాలమే సమాధానం చెప్పనుంది.


## సూరత్‌లో ఘోర అగ్నిప్రమాదం..

# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సజీవదహనం



సూరత్, మార్చి 31 : మూడంతస్తుల భవనం లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకొని చిన్నారి సహా ఐదురుగు ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన గుజరాత్‌లోని సూరత్ నగరం లింబాయత్ ప్రాంతంలోని మిథీ ఖాడీలో మంగళవారం చోటుచేసుకుంది. ఒక మూడం తస్తుల భవనం లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మహిళలు, ఒక నాలుగేళ్ల బాలుడు మృతి చెందారు. ఆ కుటుంబం ఇంట్లోనే చీరల ప్యాకింగ్ పనులను నిర్వహిస్తోందని, ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ప్యాకింగ్ కోసం ఉపయోగించే ఫోమ్ షీట్లకు మంటలు వేగంగా వ్యాపించడంతో ఇళ్లంతా దట్టమైన, విషపూరితమైన పొగతో నిండిపోవడంతో ఇంట్లో ఉన్న వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ప్రమాదం జరిగిన సమయంలో బాధితులు తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, భవనం ఇరుకుగా ఉండటం, పొగ కమ్మేయడంతో ఊపిరి ఆడక వారు లోపలే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఐదుగురు సజీవ దహనమయ్యారు. వీరంతా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసినట్లు పోలీసులు మీడియాకు తెలిపారు.

# ఇరాన్ ఓడిపోయే వరకు యుద్ధం కొనసాగించండి..!




వాషింగ్టన్, మార్చి 31 : ఇరాన్ ఓడిపోయేవరకు యుద్ధం కొనసాగించాలని గల్ఫ్ దేశాలు కోరుకుంటున్నాయట. ప్రస్తుత పాలనాయంత్రాంగం పూర్తిగా కూలిపోయేవరకు యుద్ధం ముగించవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రైవేట్‌గా కోరాయట. అలా కోరిన దేశాల జాబితాలో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్ ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది.

"నెల రోజులుగా జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్ చెప్పుకోదగ్గ స్థాయిలో బలహీనపడలేదు. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలి. అప్పటివరకు సైనికచర్య ముగియకూడదు" అని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరారని ఆ వార్తా ఏజెన్సీ కథనం వెల్లడించింది. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ అధికారులను ఉటంకించింది. ఇరాన్‌పై దాడి గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయట. ఈ ఘర్షణలు ఎలాగూ కొనసాగుతున్నాయి గనక.. టెహ్రాన్‌లోని మతపెద్దల పాలనను పూర్తిగా కూలదోయడానికి ఇదొక చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని పేర్కొంది.

**హర్మూజ్ గురించి నాకెందుకు..**
**ఎపిక్ ఫ్యూరీని ఆపేస్తా..!**

అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో యుద్ధరంగంలోకి దిగడంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. దానిని తెరిపిస్తామని ట్రంప్ ప్రకటనలు చేశారు. అయితే ఇప్పుడు వాటికి భిన్నమైన కథనాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసుకొచ్చింది. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. హర్మూజ్ ఇప్పటికీ మూతపడే ఉన్నా.. ట్రంప్ ఈ ఆలోచన చేస్తున్నారట. ఈ కథనాలు ఇలాఉంటే.. మరోవైపు పశ్చిమాసియాలో అమెరికా బలగాల మోహరింపులు పెరుగుతుండటం గమనార్హం.

# జులై నాటికి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు: చంద్రబాబు



అమరావతి, మార్చి 31 (పోలీస్ నిఘా) : మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంజీవని ప్రాజెక్టును జులైలోగా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెలా నాలుగో శనివారం స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ గ్రామసభలు, హెల్త్ క్యాంప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించారు. సంజీవని ప్రాజెక్టుపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పరిధిలోని నారావారి పల్లెలో సమర్థంగా అమలవుతున్న సంజీవని ప్రాజెక్టును జులైలోగా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలని అధికారులను ఆదేశించారు.

## పాలస్తీనీయులు ఉగ్ర దాడి చేస్తే..

# మరణ శిక్షే: ఇజ్రాయెల్




ఇజ్రాయెల్, మార్చి 31 : దేశంలో ఉగ్ర దాడులకు పాల్పడిన పాలస్తీనీయులకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్) అమల్లోకి తెచ్చింది. దాదాపు పన్నెండు గంటల చర్చ తర్వాత దీనిని ఆమోదించారు. దీని ప్రకారం.. ఉగ్ర దాడులకు పాల్పడిన వారందరికీ మరణశిక్ష విధించే అధికారం అక్కడి కోర్టులకు ఉంటుంది. శిక్ష విధించిన 90 రోజుల లోపు దానిని అమలుచేయాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం న్యాయస్థానం నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తుంది. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతంపై హమాస్ చేసిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ దాడులకు పాల్పడిన నిందితులకు ఈ చట్టం వర్తించదన్నారు. ఇజ్రాయెల్ పౌరులు, నివాసితులను ఈ చట్టం నుంచి మినహాయించినప్పటికీ.. ప్రత్యేక నిబంధన ప్రకారం ఉగ్ర కార్యకలాపాలతో ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఇజ్రాయెలీలకు సైతం ఈ చట్టం వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నిర్ణయాన్ని అమెరికా స్వాగతించింది. సొంత చట్టాలను ప్రవేశపెట్టుకొనే హక్కు ఇజ్రాయెల్ పార్లమెంట్‌కు ఉందని పేర్కొంది.

**వార్షిక బడ్జెట్‌కు ఆమోదం**

సుదీర్ఘ సమావేశం అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్ వార్షిక బడ్జెట్‌ను ఆమోదించింది. సాధారణంగా ప్రభుత్వ పదవీకాలం పూర్తికాకముందే ఇజ్రాయెల్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. నెతన్యాహు ప్రభుత్వం నాలుగేళ్ల పదవీకాలం మరికొన్ని నెలల్లో పూర్తి కానుంది. అక్టోబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ సమయంలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడం గమనార్హం.

## కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..!


### సురక్షితంగా బయటపడ్డ 24 మంది సిబ్బంది



కువైట్, మార్చి 31 : గల్ఫ్ దేశాలపై ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా కువైట్‌కు చెందిన ఓ చమురు ట్యాంకర్‌పై భీకర దాడి చేసింది. ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఓ ప్రకటనలో ఈ ఘటనను ధ్రువీకరించింది. కువైట్‌కు చెందిన 'అల్ సల్మీ' అనే భారీ ముడిచమురు నౌక దుబాయ్ పోర్టు వద్ద ఉంది. దీనిపై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేయగా.. పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ.. 24 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు ధ్రువీకరించారు. అయితే, దాడి సమయంలో ట్యాంకర్ నిండా చమురు ఉన్నట్లు తెలుస్తోంది. సముద్ర జలాల్లో చమురు ఒలికే ప్రమాదం ఉందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనను దుబాయ్ అధికారులు కూడా ధ్రువీకరించారు. రెస్క్యూ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

## చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు..

# నలుగురికి తీవ్రగాయాలు



చల్లపల్లి, మార్చి 31 (పోలీస్ నిఘా) : కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

**జిల్లా ఎస్పీతో మాట్లాడిన హోంమంత్రి**

పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోం మంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

# గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

## మంత్రి సీతక్క



హైదరాబాద్, మార్చి 31 (పోలీస్ నిఘా) : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. జిల్లాల పంచాయతీ అధికారులతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం జరుపుతున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామ సభలు ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అత్యంత ముఖ్యమైన వేదికలని పేర్కొన్నారు. పాలనలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడం, గ్రామస్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్దిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టి గ్రామస్థులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. సభల అజెండాను స్పష్టంగా ప్రజలకు తెలియజేసి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై విస్తృతంగా జరగాలన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన నూతన పథకాల కోసం అర్హులను గుర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ సభలో విధిగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామ సమస్యలను సమగ్రంగా గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అనంతరం సమావేశ వివరాలను నమోదు చేసి సమస్యలు, తీర్మానాలు, తీసుకున్న నిర్ణయాలపై నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు.

# బీజేపీలో చేరిన టెన్నిస్ ఐకాన్ లియాండర్ పేస్



న్యూఢిల్లీ, మార్చి 31 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ భాజపాలో చేరారు. మంగళవారం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పేస్ సాధించిన విజయాలను రిజిజు గుర్తుచేసుకున్నారు. 22 ఏళ్లకే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గి, పేస్ సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. రిజిజు మాట్లాడుతూ.."ఒలింపిక్ మెడల్స్ జాబితాలో భారత్ పేరు చేరేలా చేశారు. భాజపా వేదికగా ఇకనుంచి ఆయన దేశానికి సేవ చేయనున్నారు" రిజిజు పేర్కొన్నారు. కోల్‌కతాలో పుట్టిన పేస్.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్నిస్ వైపు నడిచారు. తన కెరీర్‌లో ఏకంగా 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచాడు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8 పురుషుల డబుల్స్‌లో నెగ్గారు. రాకెట్ వదిలి.. 2021లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడు ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. ఇక, బెంగాల్‌కు రెండు దఫాలుగా ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్



న్యూఢిల్లీ, మార్చి 31 : ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్ అయ్యారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యులు కొన్ని రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. వైద్యులు ఆమెకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# మహిళలకు నెలకు రూ.3వేలు: అస్సాంలో బీజేపీ మ్యానిఫెస్టో విడుదల



అస్సాం, మార్చి 31 : ఇంటర్నెట్‌డెస్క్: అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. భాజపా మంగళవారం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)తో పాటు మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తామంటూ పలు హామీలు ప్రకటించింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ , ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు విడుదల చేశారు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు..**

రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్, ఎస్టీ ప్రాంతాలు మినహా.. అస్సాం అంతటా యూసీసీ అమలు. వరదరహిత రాష్ట్రంగా చర్యలు. బంగ్లాదేశీ మియాలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం. అరుణోదయ పథకం కింద మహిళలకు నెలకు రూ.3వేలు అందజేత. ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగాల కల్పన. లఖ్‌పతి దీదీ పథకం కింద 40లక్షల మంది మహిళలకు ప్రోత్సాహకాలు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279